ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
16
సోమవారం 21 ఆగస్టు 2017



రేపు బుద్వేల్‌కు సీఎం రాక..



- రెడ్డి హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన
- స్థలాన్ని పరిశీలించిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

- వివరాలు 16లో..



ఈసారి మత్స్యకారులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. నీలి విప్లవానికి 'వరుణ' గండం పట్టుకుంది. వర్షాలు కురవక... నేటికీ చెరువుల్లోకి నీరు రాక..చేపపిల్లలను వదిలే కార్యక్రమం నిలిచిపోయింది. ఈ ఏడాది మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 1314 చెరువులు, కుంటల్లో కోటి 40 లక్షల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నేటికీ ఒక్క చెరువులో కూడా చేప పిల్లలను వదలలేని దుస్థితి నెలకొన్నది. అదును దాటిపోతుండటంతో మత్స్యకారుల్లో తీవ్ర నిరాశ అలుముకుంటోంది. మత్స్యకారులు వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ఇబ్రహీంపట్నం, శేరిగూడ గ్రామాల మధ్య చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన విత్తన ఉత్పత్తి కేంద్రం మూడేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 45 లక్షల చేపపిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్నా.. మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్నారు.



నీలి విప్లవానికి.. వరుణ గండం

- వర్షాలేక నిండని చెరువులు
- నీరున్న చెరువుల్లో వదలని చేపలు
- చెరువులకు దూరమైన చేపలు..
- శేరిగూడలో నిరుపయోగంగా చేపపిల్లల ఉత్పత్తికేంద్రం
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు
- దాటుతున్న అదును.. ఆందోళనలో మత్స్యకారులు
- ఈ ఏడాది చేప విత్తనాల లక్ష్యం : 1.40 లక్షలు
- ఒక్క చేప కూడా చెరువుల్లో చేరని వైనం
- వంద శాతం సబ్సిడీపై చేప విత్తనాలు

9లో

నీరు లేక వెలవెలబోతున్న ఇబ్రహీంపట్నం చెరువు

పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలి

టీసీపీఎస్‌ఈఏ సంఘం డిమాండ్
శంషాబాద్‌లో ర్యాలీ

16

తెలంగాణకు ప్రాణం.. బోనం

మండలి చైర్మన్ స్వామిగౌడ్

- మెయిన్‌లో..

కొనసాగుతున్న వెండి కొండసిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

3

తస్మాత్ జాగ్రత్త

బంగారం దొరికింది...! కొంటారా..? అని వ్యాపారులకు ఫోన్‌కాల్స్

9

సొంతింట్లోనూ.. పరాయే.!

నేడు జాతీయ వృద్ధుల దినోత్సవం

- ప్రత్యేక కథనం 9లో

పాలమూరు ఎత్తిపోతల సాధన కోసం.. పార్టీలకతీతంగా పోరాటం

- పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి
- హాజరైన మాజీ ఎమ్మెల్యేలు, సీపీఎం, సీపీఐ పార్టీల నాయకులు



మెయిన్ 7లో

ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు

వంటింట.. ఉల్లిమంట..



వంటింట్లో ఉల్లి మంట భగ్గుమంటోంది. కోయక ముందే కన్నీరు తెప్పిస్తోంది. ధర ఆకాశాన్నంటడంతో ఉల్లిగడ్డలను కొనాలంటే సామాన్యులు జంకుతున్నారు. గతనెల కిలో రూ. 15 ఉన్న ధర.. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.35 నుంచి రూ. 40 వరకు అమ్ముతున్నారు. ఉల్లి నిల్వలు లేక, మహారాష్ట్ర, కర్నూల్‌లో ఉల్లి పంటలు దెబ్బతినటంతో దిగుబడి తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

16లో

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి.. ● ఆకాశాన్నంటిన ధర ● గరిష్ఠంగా కిలో రూ. 40

అమీర్‌పేట గ్రామ అంబేద్కర్‌సంఘం అధ్యక్షుడిగా నల్ల నర్సింహ

మహేశ్వరం : మండలంలోని అమీర్‌పేట గ్రామంలో అంబేద్కర్ సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నల్ల నర్సింహను సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా డి.హరికృష్ణ, ఆంజనేయులు, రవి, జంగయ్య, యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, గోల్కొండ భుజేందర్, కోశాధికారిగా సురేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. యువజన సంఘాలు గ్రామాల అభివృద్ధితోపాటు సమాజసేవలో రాజకీయాలకతీతంగా పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోల్కొండ రాములు, ఎంపీటీసీ టి. రాములు, వెంకటయ్య, రాంచంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఎదురులేనిశక్తిగా టీఆర్ఎస్'


మంఖాల్ గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి


ఘట్టుపల్లి గ్రామంలో బోనం ఎత్తుకున్న టీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తీగలఅనితారెడ్డి

మహేశ్వరం : నియోజకవర్గంలో టీఆర్ ఎస్‌ను తిరుగులేని శక్తిగా తయారు చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న పలురకాల సంక్షేమ పథకాలకు ఆకర్శితులై టీఆర్ఎస్‌లో చేరడానికి ఇతర పార్టీల నాయ కులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని మంఖాల్ గ్రామంలో టీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజవర్గంలోని రోడ్ల మరమత్తులకు కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్, జూనియర్‌కళాశాల, గురుకుల విద్యాలయం, మార్కెట్‌యార్డు వంటి అభివృద్ధి పనులతోపాటు ఇంటింటికీ తాగునీరందించే దుకు మిషన్ భగీరథ పనులు త్వరలో పూర్తి కానున్నాయని అన్నారు. అదే విధంగా ఈ పథకం ద్వారా కందుకూరు, మహేశ్వరం మండలాల్లోని లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే తీగల స్పష్టం చేశారు. అనంతరం మంఖాల్ గ్రామపంచాయతీ పరిధిలోని బస్వగూడ తండాకు నూతనంగా బస్సు సౌకర్యాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మంఖాల్ గ్రామ అధ్యక్షుడు బి. శ్రీకాంత్‌గౌడ్, శ్యామ్‌లాల్‌రాజు, రాచూరిశ్రీనువాస్ గుప్త, ప్రకాష్, శ్రీధర్‌బాబు, రాజ్‌కుమార్, శివ, శ్రీను, భవానివెంకట్‌రెడ్డి, ప్రవీణ్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

మహేశ్వరం : మండలపరిధిలోని ఘట్టుపల్లి గ్రామంలో పోచమ్మ బోనాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో సాయంత్రం సామూహికబోనాల ఊరేగింపులో మహిళలు పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల్లో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుల దరువులు, బ్యాండుమేళాలు, యువతీ యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న తీగల అనితారెడ్డి మాట్లాడుతూ .. రాష్ట్రంలో ముఖ్యమైన పండగల్లో ఒకటైన బోనాల పండుగకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. గ్రామాల్లో బోనాలు వస్తే గ్రామ దేవతల దేవాలయాలను రంగురంగులతో అలంకరించి, బంధుమిత్రులతో సందడిగా పండుగను జరుపుకుంటారన్నారు. ఉత్సవాల్లో సర్పంచ్ కె. రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు : మండలపరిధిలో బోనాల ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం చిప్పలపల్లి, మురళీనగర్, అగర్‌మియాగూడ, బైరాగిగూడ, నేదునూరు, జబ్బార్‌గూడ, తదితర గ్రామాల్లో అత్యంత వైభవంగా బోనాలు జరుపుకున్నారు. అగర్‌మియగూడ గ్రామంలో మహేశ్వరం ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు యాదిరెడ్డి, నర్సింహ, గణేష్, హరిత, పొట్ట అరుణ, శారద, ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, పాండు, మండల సహకార సంఘం చైర్మన్ మల్లేష్, టీఆర్ఎస్ నాయకులు లక్ష్మినర్సింహ్మారెడ్డి, పి.బిక్షపతి, బెస్త గణేష్, రాజశేఖర్‌రెడ్డి, పాండు, అంజయ్య, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణానాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు ఎస్. వెంకట్‌రాంరెడ్డి, రేవంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అగర్‌మియగూడ గ్రామంలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న జడ్పీటీసీ ఏనుగు జంగారెడ్డి

'మిషన్‌భగీరథ'తో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం


శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ


కందుకూరు : ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన మిషన్ భగీరథ పథకంతో ఈ ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవు తుందని, ఆ దిశగా పనులను వేగవంతంగా చేపట్టాలని ఎంపీటీసీ సరికొండ పాండు తెలిపారు. ఆదివారం కందుకూరు గ్రామంలో 21లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆకుల మల్లప్ప, టంకరి రూపహన్మంత్‌రెడ్డి, నాయకులు ఎం.రమేష్, పి.కృష్ణ, శ్రీపతి రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం'


మాట్లాడుతున్న నాయకులు

కందుకూరు : ప్రత్యేకరాష్ట్రం ఏర్పడినా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుప్పల విజేందర్ ఆరోపించారు. ఆదివారం మండలకేంద్రంలో ఆ సంఘం జిల్లా నాయకులు టి.వినోద్‌చారితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజుల వసూళ్లలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికల ముందు విద్యారంగ అభ్యున్నతికి పాటు పడతానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్, అనీల్‌గౌడ్, వి.మహేందర్, సాయిపవన్, గోవర్ధన్‌రెడ్డి, అనీల్, రాజు, ఎండి.నహీమ్, చోటు, యశ్వంత్, ప్రభాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం


శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కందుకూరు : కుట్టుమిషన్ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని సర్పంచ్ దేరంగుల నర్సింహ్మ అన్నారు. ఆదివారం మహిళ డెవలప్‌మెంట్ సోషల్ వర్క్ సొసైటీ ఆధ్వర్యంలో మీర్ఖాన్‌పేట గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళ మండల్ డెవలప్‌మెంట్ ద్వారా గ్రామాల్లో మూడునెలలపాటు ఒక్కొక్క గ్రామంలో 20మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సొసైటి కార్యదర్శి సిహెచ్.సునీత, ఉపసర్పంచ్ ఎన్.జంగయ్య, వార్డుసభ్యులు గుద్దేటి నర్సింహ్మ, ఎస్‌జీవో డైరక్టర్ ఎస్‌వి తిరుమలరావు పాల్గొన్నారు.

'ఎరుకల' సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం


సభలో మాట్లాడుతున్న అంజయ్య

కందుకూరు : ఎరుకల కులస్థుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు వివక్ష చూపుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. అంజయ్య ఆరోపించారు. ఆదివారం మండలపరిధిలోని మాన్యగూడ గ్రామంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎరుకల కులస్థులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిపారు. హక్కులను సాధించుకునే వరకు ప్రతిఒక్కరూ సంఘటితమై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎరుకల కులస్థుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా వలిగి మల్లేష్, ఉపాధ్యక్షులుగా శివ, కె. కుమార్, ప్రధానకార్యదర్శిగా కె.జంగయ్య, కోశాధికారిగా వి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు హనుమంతు, రాజు, బి.శ్రీను, కె.శ్రీశైలం పాల్గొన్నారు.

దాసర్లపల్లిలో ఘనంగా చండీహోమం


హోమానికి హాజరైన భక్తులు

కందుకూరు : మండలపరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో ఆదివారం చండీ హోమాన్ని ఘ నంగా నిర్వహించారు. శ్రీమాత వేద విజ్ఞాన ప్రచార పరిషత్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు రేవెళ్ళ రాజు శర్మ మాట్లాడారు. ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు వృద్ధి చెందడానికి శ్రావణమాసం కావడంతో వివిధ గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగున్నరేళ్లగా ప్రతినెలా భక్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో చండీ హోమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారానికి 59వ చండీహోమంలో 16 హోమ గుండాల వద్ద భక్త దంపతులు ప్రత్యేక పూజలు చేశారన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తొండుపల్లిలో స్వేరోస్ జెండావిష్కరణ

శంషాబాద్‌రూరల్: మండలపరిధిలోని తొండుపల్లిలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, ఉపాధ్యాక్షుడు రాచమల్ల జయసింహ స్వేరోస్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో మార్పులు తీసుకురావడానికి స్వేరోస్ ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంస్థల ఉద్యోగులు, విద్యావంతులు, శాస్త్రవేత్తలు భాగస్వాములయ్యారని చెప్పారు. ప్రతిఇంటిపై స్వేరోస్ జెండా.. గుండెల్లో స్వేరోస్ నినాదం.. అనే ధ్యేయంతో పని చేస్తున్నామన్నారు. ఆదివారం తొండుపల్లిలో స్వేరోస్ కార్యకర్తల ఇళ్లపై జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా కార్యదర్శి రాచమల్ల అర్జున్, స్వేరోస్ లాయర్ ప్రభాకర్, తార, హరి, కిశోర్, నితిన్, ప్రణీత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సొసైటీ కనెక్ట్ అవగాహన సదస్సు


సదస్సు నిర్వహిస్తున్న సిబ్బంది

శంషాబాద్ : మండలకేంద్రం శంషాబాద్‌లోని స్టేట్‌బ్యాంక్‌ఆఫ్ ఇండియా బ్యాంకు ఎదుట బ్యాంకు సిబ్బంది ఆదివారం సొసైటీ కనెక్ట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం ఈ బ్యాంకింగ్, వస్తువుల కొనుగోలు, ఆయా రకాల లోన్లు ఎలా పొందవచ్చు అనే విషయాలను ఖాతాదారులకు వివరించారు. అలాగే ఆన్‌లైన్ లావాదేవీలు ఎలా నిర్వహించాలి అనే అంశాలపై సందేహాలకు జవాబులు చెప్పారు. కార్యక్రమంలో శారద, ఉషారెడ్డి, లలిత, సూరజ్‌సింగ్, మక్బూల్‌బాష పాల్గొన్నారు.

'ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకే శిక్షణ'



కేజీబీవీఎస్ పాఠశాలలో శిక్షణ పొందిన విద్యార్థులతో కో-ఆర్డినేటర్ వాయిస్ ఫోర్‌గల్స్ సంస్థ ప్రతినిధులు

కందుకూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బధిరుల పాఠశాల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ప్రతి ఏడాది మూడు దఫాలుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థినులలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు వాయిస్ ఫోర్‌గల్స్ స్వచ్ఛంద సంస్థ కంకణం కట్టుకుంది. కలెక్టర్ రఘునందన్‌రావు, డీఈవో చొరవతో ఈ సంస్థ ప్రతినిధులు వారంరోజులపాటు ఇక్కడే ఉంటూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. ఏడాదిలో మూడు దఫాలుగా నిర్వహించనున్న శిక్షణ తరగతులు పరిచయం(ప్రస్తుతం), దిశ(శీతాకాలం), సఖీ(వేసవికాలం)లో చేపట్టనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కస్తూర్బాగాంధీ బధిరుల పాఠశాలల్లో చదివే మారుమూల గ్రామాల పేద విద్యార్థినులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి ఉత్తమ ఫలితాలను రాబట్టేందుకు సంకల్పించడానికి శ్రీకారం చుట్టినట్లు వాయిస్ ఫోర్‌గల్స్ సంస్థ కౌన్సిలర్లు మీనాక్షి, మౌనిక, చిద్విత, వి శ్వమానస, నిహారిక, యుగస్మీత తెలిపారు. 10 రోజుల పాటు విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

విద్యార్థినులకు ధీమా కల్పిస్తాం.. : యలమర్తి రమ్య, వాయిస్ ఫోర్ గల్స్ సంస్థ కో-ఆర్డినేటర్



తమ సంస్థ బాలికల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని, 2011లో దీనిని స్థాపించడం జరిగింది. తమ సంస్థ చైర్మన్ అనుష్, భరద్వాజ్ ఆధ్వర్యంలో జిల్లాలోని కందుకూరు, చేవెళ్ల, రాజేందర్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, కొందుర్గు, కేశంపేట, ఆమనగల్లు, మాడుల మండలాల పరిధిలోని కస్తూర్బాగాంధ బధిరుల పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినులకు 10రోజులపాటు వివిధ రంగాల్లో శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుంది. మహిళలు అన్నిరంగాల్లో రాణించడానికి విద్యార్థి దశ నుంచి ఇలాంటి శిక్షణ ఇవ్వడం దోహదపడుతుంది. విద్యార్థినులు విద్యతోపాటు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించడానికి తమ సంస్థ మరింత ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా 28న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : నూతన పెన్షన్ (సీపీఎస్) విధానానికి వ్యతి రేకంగా 28న జాక్టో పక్షాన జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రం సమర్పించనున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, పరమేశ తెలిపారు. 2004 సెప్టెంబర్ 1 తరువాత నియామకమైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సెప్టెంబర్ 1న నిర్వహిస్తున్న పెన్షన్ విద్రోహ దినానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి ధర్నాకు హాజరు కావాలని కోరారు.

సాక్షరభారత్ సార్వత్రిక పరీక్షకు 360 మంది అభ్యాసకుల హాజరు

ఆమనగల్లు : ఆమనగల్లు ఉమ్మడి మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లోని సాక్షర భారత్ కేంద్రాల్లో ఆదివారం అభ్యాసకులకు సార్వత్రిక పరీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో 360మంది అభ్యాసకులు పరీక్షలకు హజరయ్యారు. సాక్షర భారత్ మండల కో-ఆర్డినేటర్ డి.పురుషోత్తం పర్యవేక్షణలో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల సాక్షర భారత్ కో-ఆర్డినేటర్లు పరీక్షలు నిర్వహించారు. మైసిగండి ,కర్కల్‌పహాడ్ పరీక్ష కేంద్రాలను హైద్రాబాద్ జిల్లా వయోజన విద్య పరిశీలకులు వరదాచారి, రంగారెడ్డి జిల్లా ఉప సంచాలకులు రాందాస్ నాయక్‌లు తనిఖీ చేశారు. పరీక్షల తీరును పరిశీలించారు. పరీక్షల్లో పాల్గొన్న వయోజనులకు త్వరలోనే ప్రభుత్వం ద్వారా ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని మండల కో-ఆర్డినేటర్ పురుషోత్తం తెలిపారు.

ఘనంగా వెండి కొండసిద్ధేశ్వర స్వామి జాతర



జాతరకు హాజరైన భక్తులు

శంషాబాద్ : శంషాబాద్ మండలవాసుల ఇలవేల్పు శ్రీ వెండికొండసిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతు న్నాయి. రెండోరోజు ఆదివారం 50వేల మంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు ఆర్టీసీసంస్థ జంట నగరాల్లోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తుంది. రేపు శ్రావణ చివరి సోమవారం కావడంతో భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ఉత్సవాల్లోభాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండగగా జరిగింది. అనంతరం భక్తులంతా భజన చేస్తూ జాగరణ చేశారు. సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు జరుగునని నిర్వాహకులు తెలిపారు.

టీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌లాల్

ఎల్‌బీనగర్: టీఆర్ఎస్‌కేవీ ఆటో యూని యన్ జిల్లా అధ్యక్షుడిగా శంకర్‌లాల్ రమావత్ నియమితులయ్యారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో టీఆర్ ఎస్‌కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్యలు శంకర్‌లాల్‌కు నియామక పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు శంకర్ లాల్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జ్ సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరశురాముడు, ఉపాధ్యక్షుడు రమావత్ రాములు, దేవ్‌రాజ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌లాల్ రమావత్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాంబాబుయాదవ్, మారయ్య



శివున్ని జల దిగ్బంధం చేసి పూజలు చేస్తున్న భక్తులు

వర్షం కోసం.. శివుని జల దిగ్బంధం

షాద్‌నగర్‌టౌన్: వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థిస్తూ ఫరూఖ్‌నగర్ గోల్డెన్ పార్కులో గల హనుమాన్ ఆలయంలోని శివాలయంలో భక్తులు ఆదివారం 1,116బిందెలతో జల దిగ్బంధం చేశారు. ఈ మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో విద్యాసాగర్, నర్సింహులు, అంజయ్య, ఆనంద్, సత్తయ్య, రమేష్, శ్రీను, స్వామి, రవి పాల్గొన్నారు.

'దుకాణాలకు టెండర్‌ను వెంటనే నిర్వహించాలి'

శంకర్‌పల్లి: పంచాయతీ దుకాణాలకు వెంటనే టెండర్ నిర్వహించాలని హిందూ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 89 దుకాణాలకు టెండర్ కాలం గడిచినందున అధికారులు ఇప్పటికైనా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు.

రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా, అవినీతికి అస్కారం కల్పించకుండా పంచాయతీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీ భారీఎత్తున ఆదాయాన్ని కోల్పోతున్నదని, సిబ్బంది జీతాలకు డబ్బులు లేకుండా దివాలా తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్రభాకర్, శ్రీనివాస్, రఘునందన్‌రెడ్డి ఉన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలను కొనసాగిస్తాం

● డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి

చేవెళ్ల రూరల్ : దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మర్చిపోలేనివని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి అన్నారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసం రాజీవ్‌గాంధీ చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికి ఉపయోగపడుతున్నాయని చెప్పారు. నూతన సాంకేతిక రంగం అభివృద్ధి కోసం ఆరోజుల్లోనే శ్రీకారం చుట్టారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలూర్ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, అంతారం సర్పంచ్ వీరేందర్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పలుగుట్ట శ్రీనివాస్‌గౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశంగుప్త, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మాధవ్‌గౌడ్, నాయకులు మాధవరెడ్డి, నారాయణ, బాలయ్య తదితరులు ఉన్నారు.



శంకర్‌పల్లిలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చేవెళ్లలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



హిమాయత్‌నగర్‌లో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

మొయినాబాద్‌లో: భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త నర్సింహారెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో, అజీజ్‌నగర్ గ్రామాల్లోని రాజీవ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆశాజ్యోతిగా రాజీవ్‌గాంధీ పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీల పాలనలోనే దేశంలోని పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కంజర్ల భాస్కర్, దారెడ్డి కృష్ణారెడ్డి, చందానగర్ సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీలు మాణిక్‌రెడ్డి, మాధవరెడ్డి, యాదయ్య, మండల నాయకులు మగ్బూల్, ఈగ రవీందర్‌రెడ్డి, సద్గుణాచారి, మాణిక్య, శంకర్, శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, వెంకటేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శంకర్‌పల్లిలో: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ శశిధర్‌రెడ్డి తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా శంకర్‌పల్లిలోని అరుణోదయ యూత్‌క్లబ్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారతదేశం అభివృద్ధి పథంలో నడవడానికి బాటలు వేశారని గుర్తుచేశారు. నేటి యువత ఆయన చూపిన బాటలో నడవాలని సూచించారు. భారతదేశంలో టెక్నాలజీకీ ఆద్యుడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు విఠలయ్య, పార్శి బాలక్రిష్ణ, పాండురంగారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, గౌస్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్‌గుప్త

ఆర్యవైశ్య సంక్షేమం కోసం కృషి

● ఆర్యవైశ్య సంఘం జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గుప్తా

చేవెళ్ల రూరల్ : ఆర్యవైశ్యుల సంక్షేమంకోసం కృషి చేస్తానని ఆర్యవైశ్య సంఘం జాతీయ అధ్యక్షుడు గ్రంధి ప్రేమ్‌కుమార్‌గుప్త తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్వసుజాత, రాష్ట్ర సలహాదారు సిద్ద లక్ష్మి, రోజారమణి, పీఆర్‌వో గుప్త, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌గుప్త, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు ఎం. వెంకటేశంగుప్త, చేవెళ్ల, షాబాద్ ఆయా మండలాల సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

6, 9 తరగతుల్లో ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో 6, 9 తరగతుల్లో ఉన్న ఖాళీలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి కృష్ణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతిల్లో 2 సీట్లు, 9వ తరగతిల్లో 2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు సోమవారం పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్ : ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ సీట్ల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లారీ ఢీకొని రైతు మృతి

శంకర్‌పల్లి: లారీ, బొలెరో వాహనం ఢీకొనడంతో ఓ రైతు మృతి చెందాడు. నవాబుపేట్ మండలం చించల్‌పేట్ గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అరవింద్‌కుమార్, శ్రీకాంత్, రాజు (28) తమ పొలంలో పండించిన కూరగాయలను బొలెరో వాహనంలో శంకర్‌పల్లి మీదుగా మూసాపేట్ మార్కెట్‌కు ఆదివారం తెల్లవారుజామున తీసుకెళుతున్నారు. బొలెరో వాహనం శంకర్‌పల్లి దాటాక 400 సబ్‌స్టేషన్ ఎదురుగా లారీ వేగంగా వచ్చి ఢీకొన్నది. దీంతో రైతు రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో సంగారెడ్డికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగతా రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఢీకొన్న లారీ, బొలెరో

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొయినాబాద్: మండలంలోని చిలుకూరులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2001-02 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 16 సంవత్సరాలుగా ఒకరిని ఒకరు కలుసుకోకుండా దూరంగా ఉన్న వీరందరు ఒకచోట చేరారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సైతం ఆహ్వానించారు. 50 మంది పూర్వ విద్యార్థులందరు ఒకచోట చేరి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కష్టసుఖాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, విజయరాజు, రంగస్వామి, సర్సింహారెడ్డి, దయానంద్, మాధవి, శర్మ, పుండరీకం, వెంకట్‌రెడ్డి, సువర్ణరెడ్డి, రాజేంద్రప్రసాద్, చందునాయక్, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధేశించుకుని ముందుకు సాగాలి: సీఐ

చేవెళ్ల రూరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, కష్టపడి చదివి, ఉన్నత స్థానం చేరుకోవాలని చేవెళ్ల సీఐ గురవయ్య తెలిపారు. ఆదివారం కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన వాయిస్ ఆఫ్ గర్ల్స్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మహిళలుచదువుకుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

అధికారులు, పాలకులు కుమ్మక్కు

● పంచాయతీ ఆదాయానికి గండి

శంకర్‌పల్లి: గ్రామ పంచాయతీ దుకాణాల ఆదాయానికి పాలకులు, అధికారులు భారీఎత్తున గండికొడుతున్నారని మండల ఎమ్మార్పీస్ అధ్యక్షుడు వెంకటేష్ ఆరోపించారు. శంకర్‌పల్లిలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీ దుకాణాలు పాలకులకు, అధికారులకు కామధేనువుగా, కల్పవృక్షంగా మారాయని ఆరోపించారు. టెండర్ గడువు ముగిసినా పంచాయతీ అధికారులు దుకాణాలకు ఎందుకు టెండర్ నిర్వహించడం లేదో ఇట్టే అర్థం చేసుకోవచ్చని అన్నారు. దుకాణాలు మెత్తం 267 ఉండగా అందులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. ఈదుకాణాలకు బహిరంగ మార్కెట్‌లో టెండర్ నిర్వహిస్తే నెలకు రూ. 10వేల నుంచి 20వేలు వరకు కిరాయి వస్తుంది. కాని దుకాణదారులు అప్పటి రేటు ప్రకారం ఇవ్వడంతో సిబ్బంది జీతాలకే సరిపోక ఆరేడు నెలలకు ఒకసారి జీతాలు ఇచ్చే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధన ప్రకారం టెండర్ నిర్వహిస్తే పంచాయతీకి సంవత్సరానికి సుమారుగా 3 కోట్ల 20 లక్షల పైనే ఆదాయం వస్తుందని, పాలకులు అధికారులు చేతులు తడుపుకుంటూ పంచాయతీకి పంగనామాలు పెడుతున్నారని ఆరోపించారు. గ్రామంలోని ప్రతి పౌరుడికి చెందాల్సిన ఆస్థి కొందరికే చెందడంతో పంచాయతీలో కనీస అవసరాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టెండర్ వేయకపోతే దుకాణాలు 267 కుటుంబాలకే చెందే అవకాశం ఉందని, అదే కనుక జరిగితే వందల కోట్ల ఆస్థి పంచాయతీ కోల్పోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

'మైనారిటీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

చేవెళ్ల రూరల్ : ప్రభుత్వ పథకాలను మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, మౌలాలి కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ షఫి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జామా మసీద్‌లో కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమం కోసం కమిటీ నిర్విరామంగా కృషి చేస్తుందన్నారు. సమాజంలో అందరూ కలిసిమెలిసి సోదర భావంతో ఉండాలని హితవు పలికారు. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు ముస్లిం యూత్ అసోసియేషన్, ఈద్గా అభివృద్ధి కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు రాజ్‌మహమ్మద్, అబ్దుల్ బాసిత్, జహంగీర్, చాన్ పాష, నసీర్ ఉన్నారు.

ఆలూర్ మాజీ సర్పంచ్ నర్సయ్య మృతి

చేవెళ్ల రూరల్ : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామ మాజీ సర్పంచ్ పూలపల్లి నర్సయ్య (80) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం గ్రామంలో ఆయన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. నర్సయ్య ఆలూర్ గ్రామానికి 1988 నుంచి 2000 సంవత్సరం వరకు సర్పంచ్‌గా పనిచేశారు. డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, దళిత రత్న అవార్డు గ్రహీత బురాన్ ప్రభాకర్, ఆలూర్ పీఏసీఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, సర్పంచ్ అనంతరాములుగౌడ్, ఎంపీటీసీలు శ్రీశైలం, విజయలక్ష్మీ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ బుచ్చయ్య, నాయకులు వెంకటయ్య, ప్రకాశ్‌గౌడ్ తదితరులు నర్సయ్య ప్రార్థివ దేహంపై పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

శాంతినగర్ కాలనీకి చెందిన ప్రముఖ కళాకారుడు, ప్రైవేట్ ఉపాధ్యాయుడు తల్లోజు శ్రీనివాస్‌ను ఆదివారం జేఏసీ మండల నాయకుడు పాపిశెట్టి రాము పరామర్శించారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌కు రాము రూ.5వేలు నగదు అందజేశారు. దాతలు, కళాకారులు, విద్యావంతులు ఆదుకోవాలని కోరారు. - (ఆమనగల్లు)





ఆమనగల్లులో..



తలకొండపల్లిలో..



కడ్తాల్‌లో..

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

- వాడవాడలా రాజీవ్‌కు ఘన నివాళి
- రోగులకు పండ్ల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు : మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేదల ప్రజల సంక్షేమానికి, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగాభివృద్ధికి రాజీవ్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ ఆద్వర్యంలో రాజీవ్ 73వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకల్లో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నేనావత్ బీక్యానాయక్; డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల ఎంపిటిసి గురిగళ్ల లక్ష్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి ఎమ్.డి.ఖలీల్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడి, రామలింగం, ఖాదర్‌ఖాద్రీ, మైసమ్మ, ఖాదర్, జంతుక యాదయ్య, వస్పుల శ్రీశైలం, సుదర్శన్,కరీమ్, నర్సింహ్మా, రాఘవేందర్, అలీమ్, జంతుక కృష్ణ, రవి, ఫిరోజ్, సాయియాదవ్, రాజు, వినోద్, శివకుమార్, మల్లేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: బస్టాండ్ వద్ద రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్ రెడ్డి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి కండె ఓంకారం, నాయకులు అజీమ్, నూకం శేఖర్, రవీందర్ యాదవ్, విష్ణు, మల్లేశ్, రమేశ్, లక్ష్మయ్య ,మైసయ్య ,చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : రాజీవ్ జయంతి వేడుకలు కడ్తాల లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీక్యానాయక్ ఆద్వర్యంలో ఘనననంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి హజరై కేక్‌కట్ చేసి రాజీవ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ సేవలను ఎమ్మెల్యే, నాయకులు కొనియా డారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, డిసిసి అధికారి ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసిలు చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, నాయకులు కందికంటి యాద య్య గౌడ్, లాయక్‌అలీ, జహంగీర్‌బాబా, యాదగిరి, లక్‌పతి నాయక్,హీరా నాయక్, బ్రహ్మచారి, దేవ్‌సింగ్, యాదగిరి, రాములు, మల్లేశ్ గౌడ్, గూడురు లక్ష్మీ నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురష్కరించుకొని యూత్ కాంగ్రెస్ అద్వర్యంలో మొక్కలు నాటారు. యూత్ కాంగ్రెస్ నాయకులు జహంగీర్‌బాబా, వెంకట రమణ, రహీమ్, జంగయ్య, మహేశ్, షాబొద్దిన్, ఇమ్రాన్, శ్రీకాంత్, నరేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

మాడ్గుల : మండల కేంద్రంతో పాటు అప్పారెడ్డి పల్లి గ్రామంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను యువజన కాంగ్రెస్‌నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనసేవలను కొనియాడారు. యువజన కాంగ్రెస్‌నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొప్పుల శేఖర్‌గౌడ్, మండల నాయకులు ఈశ్వర్ గౌడ్, యాదయ్య, సురేశ్, దేవేందర్, దళపతి, ఆంజనేయులు, నందీశ్వర్, చందు, వెంకటేశ్, శ్రీను, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



మాడ్గులలో..

డీజేలు వాడితే కఠిన చర్యలు తప్పవు

నిషేధంపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు : సీఐ

ఆమనగల్లు : గణేశ్ నవరాత్రోత్సవాలతో పాటు ఉత్సవాలు, ఊరేగింపులు ,వేడుకల్లో ప్రజాశాంతికి భంగం కల్గించే డిజేల వాడకం నిషేధించడం జరిగిందని ఆమనగల్లు పోలీస్ సర్కిల్ ఇనిస్పెక్టర్ పి.రవీంద్రప్రసాద్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన డిజేలు వినియోగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆమనగల్లు సిఐ కార్యాలయంలో ఆదివారం రవీంద్రప్రసాద్ విలేఖరులతో మాట్లాడుతూ కొందరు అమాయక ప్రజలను మోసం చేయడానికి డిజేల నిషేదాన్ని హైకోర్టు సడలించిందని సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని నమ్మోద్దన్నారు. మండపాల వద్ద ఎవరైన అపరిచిత వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు రామలింగారెడ్డి,సురేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆమనగల్లులో విద్యార్థి పోరుగర్జన

ఆమనగల్లు : తెలంగాణ స్టూడెంట్ యూనియన్ ఆద్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని కల్యాణి గార్డెన్‌లో సోమవారం విద్యార్థి పోరుగర్జన నిర్వహిస్తున్నట్లు టిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కట్ట జంగయ్య తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బిసి బాలుర వసతి గృహం సొంతభవనాల నిర్మాణం, ఉపకార వేతనాల పెంపుపై గర్జన నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్, ఉపాద్యాక్షుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాగాయని విమలక్క, ఓయు ప్రొఫెసర్ ఖాసీం, బహుజన నాయకుడు ఏపూరి సోమన్న, టిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాదిగ, గౌని నర్సింహ గౌడ్‌లు హాజరవుతు ్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, టిఎస్‌యు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జంగయ్య కోరారు.

లక్ష్మయ్య కుటుంబానికి రూ.30 వేలు ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు : షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమై సర్వం కోల్పోయిన పోలిశెట్టి లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదివారం ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు, తలకొండపల్లి మాజీ సర్పంచ్ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. బాధితుడి కుమారులు ఆనంద్, శ్రీనులకు మనోధైర్యం కల్పించారు. వ్యక్తిగతంగా రూ.30 వేలు నగదు అందజేశారు. నాయకులు పాండురంగయ్య, శ్రీధర్, రవి, సంజీవ్ కుమార్, రామ్మోహన్, గోల్డ్ రాము, గణేశ్‌గుప్త తదితరులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

తలకొండపల్లి : పాతకోటతండా, ఆర్లకుంట తండా, బాలాజీనగర్, యెడవల్లి, చెన్నారం మీదుగా కడ్తాల మండల కేంద్రానికి ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా తండాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు తలకొండపల్లి జడ్పీటీసీ నర్సింహకు యెడవల్లి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక ఆమనగల్లు మీదుగా కడ్తాల వెళ్లాల్సి వస్తుందని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. నాయకులు మల్లేశ్, రాము, కిషన్, గిరి, తిరుపతి, నరేశ్, విజయ్ వినతిపత్రం అందించారు.

దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలు



ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్, టీఆర్ఎస్ జిల్లా నాయకుడు జర్పుల దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం కడ్తాలలో కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. సింగిల్ విండో సబ్‌కౌంటర్ వద్ద కార్యక్రమంలో శ్రేణులు, గిరిజన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దశరథ్ నాయక్ కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు జహంగీర్‌అలీ, బిక్షపతి, శంకర్, కృష్ణ, దాసు, మహేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు. - (కడ్తాల్)

2019లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ముందుకు..

తలకొండపల్లి : 2019లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా బిజెపి శ్రేణులు ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి పిలుపు నిచ్చారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు కూడా అన్ని పదవులను కైవసం చేసుకునేలా వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఆదివారం బిజెపి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బక్కికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆచారి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జడ్పిటిసి సభ్యుడు కండె హరిప్రసాద్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బిజెపి జిల్లా కార్యదర్శి నర్సింహ, జిల్లా, మండల నాయకులు పాండు ప్రసాద్, మట్ట వెంకటేశ్, వెంకటేశ్, పాండు, గెల్వాలయ్య, కుమార్, తిరుపతయ్య, యాదగిరి, కృష్ణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచారి

'ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి'

మాడ్గుల : మండలంలోని నల్లచెరువు, నల్లవారిపల్లి, నర్సాయిపల్లి గ్రామాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామ పంచాయితీల కింద శివారు గ్రామాలుగా ఉన్న తమ గ్రామాలు అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇర్విన్ గ్రామ పంచాయతీ నుంచి నల్లచెరువు 10 కిలోమిటర్లు, మాడ్గుల గ్రామ పంచాయితీ నుంచి నర్సాయిపల్లి 5 కిలోమీటర్లు, అవురుపల్లి గ్రామ పంచాయతీ నుంచి రెండు కిలోమీటర్లు దూరం ఉంటుందని దీంతో ప్రతిసారి పంచాయితీకి వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందన్నారు. తగిన జనాభా, వనరులు ఉన్న నల్లచెరువు, నల్లవారిపల్లి, నర్సాయిపల్లి గ్రామాలను చొరవ తీసుకుని ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

70 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

తలకొండపల్లి : పడకల్ పంచాయతీ పెద్దూర్ గ్రామంలోని అవేర్ మాధవన్‌జీ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, అవేర్ ఆసుపత్రి సంయుక్త ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పడకల్ సర్పంచ్ జిల్లెల్ల కిష్టమ్మ ప్రారంభించారు. కంటి వైద్య సహాయకుడు వీరమళ్ల వెంకటస్వామి 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 20 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేశారు. లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఆవేర్ హెల్త్ కో-ఆర్డినేటర్ పి.సురేశ్‌బాబు, ఎహెచ్‌ఆర్ఎప్ మేనేజర్ వరుణ్, ఎంపిటిసిలు నర్సమ్మ, రవి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, నర్సింహ, శంకర్, కృష్ణయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు పాండురెడ్డి పాల్గొన్నారు.

కడ్తాల్ : బాలుర ఉన్నత పాఠశాలలో హైద్రాబాద్‌లో మెడిసిస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆలంపల్లి రమేశ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కడ్తాల్ సర్పంచ్ వేణుగోపాల్‌తో కలిసి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లోజు ఆచారి ప్రారంభించారు. శిబిరంలో వివిద రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జడ్పీటీసీ హరిప్రసాద్, నాయకులు హన్మనాయక్, వెంకటేశ్, ఆనంద్, లక్ష్మణ్, రమేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



తలకొండపల్లిలో..



కడ్తాల్‌లో..

'మోడల్' ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మంచాల : మంచాల మండల పరిధి ఆరుట్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. 6వ తరగతిలో 13, 7లో 4, 8వ తరగతిలో 3, 9వ తరగతిలో 10, 10వ తరగతిలో 10 సీట్లు, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు ఫారాలు తీసుకుని నేరుగా పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- రైతులను ఓటు బ్యాంకుగా చూస్తున్న కేసీఆర్ ప్రభుత్వం
- కిసాన్ పంచాయతీలతో ఏకం చేస్తాం
- బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్‌రావు



కిసాన్ పంచాయతీ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సుగుణాకర్‌రావు, ఇతర నాయకులు

ఇబ్రహీంపట్నం : గత కాంగ్రెస్ ప్రభుత్వం గాని ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం గాని రైతు సమస్యల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తూ కేవలం వీరిని ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్‌రావు అన్నారు. రైతులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి అని చెప్పుకోవడానికి వీలుంటుందనేది గుర్తెరగాలని ఆయన అన్నారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 28న మహేశ్వరం పరిధిలోని తుక్కుగూడలో కూరగాయల రైతులతో ఏర్పాటు చేయనున్న జిల్లా కిసాన్ పంచాయతీకి సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆదివారం ఇబ్రహీంపట్నంలోని బాలాజీ గార్డెన్స్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనలో జిల్లాను కూరగాయల జోన్ కింద ప్రకటించి అనేక హామీలు గుప్పించిందని అయినా చేసిందేమీ లేదని ఆరోపించారు. టీఆర్ఎస్ మూడేళ్ల పాలనలో ఎన్నికల్లో ఎట్లా గెలవాలనే ధ్యాసతప్ప తీసుకున్న చర్యలు లేవన్నారు. విలువ ఆధారితను జోడించి కూరగాయల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతులు చేయడానికి వాణిజ్య సంబంధాలు మెరుగుపర్చాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించామని ఈ దిశగా కృషి జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర మంత్రులు రాధామోహన్‌సింగ్, నిర్మలా సీతారామన్‌ను కలిసి దీనిపై చర్చించామన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఫార్మ్ ఇంటరెస్ట్ గ్రూపులను ఏర్పాటు చేయాలనేది నిర్ణయించామన్నారు. వేయి మంది రైతులను ఒక్కో గ్రూపులో చేర్చాలని వారు పండించిన కూరగాయలను నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని ఈ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయాలనేది ప్రధాన ఉద్దేశ్యమని ఆయన చెప్పారు. కూరగాయల ఉత్పత్తులకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, కొత్త వంగడాలను తీసుకురావడానికి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్‌ను ప్రవేశ పెట్టనుందని ఆయన చెప్పారు. వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈదిశగా కృషి చేయకపోవడాన్నే తాము ప్రశ్నిస్తున్నామని రైతులను ఏకం చేస్తూ దీనిని ఉద్యమ రూపంలో తీసుకువచ్చి పోరు సల్పుతామంటూ ఆయన చెప్పారు. ఇప్పటికే తెలంగాణలో వివిధ అంశాలపై మూడుచోట్ల కిసాన్ పంచాయతీలు నిర్వహించామని మొత్తం 50చోట్ల ఈ పంచాయతీలు ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొలన్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తుక్కుగూడలో ఏర్పాటుచేయనున్న కిసాన్ పంచాయతీలో ఉత్తమ రైతులుగా ఎంపికచేసిన ఆరుగురిని సన్మానిసామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోసుపల్లి ప్రతాప్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యా భాస్కర్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లబోలు బోజిరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాపయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరెడ్డి అర్జున్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గోగిరెడ్డి లచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొండ రమణారెడ్డి, నాయకులు ఎం.అంజయ్య యాదవ్, దన్నె బాసయ్య, బీజేపీ టౌన్ అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, నాయకులు బూడిద రాంరెడ్డి, కొప్పు బాష, టేకుల రాంరెడ్డి, కాసాని వెంకటేష్, ఏనుగు రాంరెడ్డి పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ క్యామ మల్లేష్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆదిభట్ల : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని బొంగ్లూరు గ్రామంలో సిద్ధి వినాయక వీరాంజనేయ, ఉమామహేశ్వరస్వామి, నవగ్రహ ఆలయంలో ధ్వజ స్తంభం, విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగింది. ఉదయం నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి మహ హోమాది కతృవులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు క్యామ మల్లేష్, బీజేపీ నాయకులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ పొట్టి ఐలయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోషబాబులు, ఎంపీటీసీ కోరె కళమ్మ జంగయ్య, కాంగ్రెస్ నాయకులు పాండాల శంకర్, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, మాజీ సర్పంచ్ గణేష్‌గౌడ్, వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పాండు, జ్యోతి మనోహర్‌లాల్, భక్తులు పాల్గొన్నారు.

'టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్ఎన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం : ఆదిభట్ల టాటా అడ్వాన్స్‌డ్ సిస్టంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ఎన్ రెడ్డి, కోశాధికారి డి.జగదీష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో సీఐటీయూ మండల కమిటీ ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా యాజమాన్యం వేధింపులకు పాల్పడి కేసులు పెట్టించడమనేది భావ్యం కాదన్నారు. రోజుకు తొమ్మిదిన్నర గంటల పనికి ఒకటి, రెండు గంటలు అదనంగా పనిచేయిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నారంటూ వారు ఆరోపించారు. పనికిదగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని అన్నారు. లేదంటే ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు బ్రహ్మయ్య, సీ.హెచ్.జంగయ్య, అంజయ్య, బి.సామేల్, ప్రకాష్‌కారత్, బుగ్గరాములు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ నాయకులు

'కేసీఆర్‌కు అవార్డు రావడం హర్షణీయం'

ఇబ్రహీంపట్నం : రైతు సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు భారత ఆహార వ్యవసాయ మండలి ప్రతిష్టాత్మకమైన అగ్రికల్చర్ లీడర్ షిప్ అవార్డును ప్రకటించడమనేది మంచి పరిణామమని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జే.పీ.శ్రీనివాస్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, తుర్కగూడ అధ్యక్షుడు ఏనుగు నరేందర్‌రెడ్డి, నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి ఎండీ.ముజఫర్‌లు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి మెరుగైన విద్యుత్‌ను అందించడంతోపాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో సాగు పెంచేందుకు ఆయన చేస్తున్న కృషి శ్లాఘనీయమన్నారు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్



నోములలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పట్నంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల : స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల వెంకటేష్‌యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 73వ జయంతి సందర్భంగా మంచాల మండల పరిధి నోములలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల కుటుంబం ఇందిరాగాంధీ కుటుంబమని పేర్కొన్నారు. నిరుపేదల అభ్యున్నతికోసం పరితపించిన నేతగా రాజీవ్‌గాంధీ చరిత్రకెక్కారని కొనియాడారు. కార్యక్రమంలో నోముల మాజీ సర్పంచ్ ముత్యమయ్య, గోపయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీశైలం, శ్రీనివాస్, యాదగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'పట్నం'లో...

ఇబ్రహీంపట్నం : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 73వ జయంతి సందర్భంగా ఆదివారం ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. చెరువుకట్టపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పండాల శంకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు యాలాల యాదయ్య, పాశం భాస్కర్ గౌడ్, మంకాల దాసు తదితరులున్నారు.

బోనమెత్తిన పల్లెలు

మంచాల : మంచాల మండల పరిధిలోని జాపాల, అస్మత్‌పూర్ గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పారిశుధ్య పనులు నిర్వహించి వీధి దీపాలు ఏర్పాటుచేశారు. బోనాల ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అలరించాయి.



జాపాలలో బోనాల ఉత్సవాలు

హనుమాన్ దేవాలయంలో స్వచ్ఛభారత్

నందిగామ: యువజన సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. నందిగామ మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలను నాటారు. ఆవరణలో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించారు. యువజన సంఘాల సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జిల్లెల్ల వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ ఈటె గణేష్, ఎంపీటీసీ దార సిరివేణి సురేష్, ఎన్ఎస్‌యుఐ కోఆర్డినేటర్ దాసరి శ్రీశైలం యాదవ్, నాయకులు తుప్పుడు కిష్టయ్య, లింగం, గుంశయ్య, రాంబాబు, జంగయ్య, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



షాద్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్: దేశానికి దేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ 73వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి విశ్వం, ఎంపీపీలు బుజ్జి, ఎం. శివశంకర్‌గౌడ్, వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కె. చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పి. చెన్నయ్య, కొత్తపేట సింగిల్‌విండో చైర్మన్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ హయాంలోనే సాంకేతిక విప్లవానికి నాంది

షాద్‌నగర్‌రూరల్: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పడిందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎంపీటీసీ చేగూరి రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీలు బుజ్జి నాయక్, శివశంకర్‌గౌడ్, నాయకులు కట్టా వెంకటేష్ గౌడ్, అగ్గనూరి విశ్వం, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కొత్తూరులో..

కొత్తూరు: మండల కేంద్రంతో పాటు బైపాస్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా రాజీవ్‌గాంధీ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగయ్య నర్సింహ యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కొందుర్గు నివాళులర్పిస్తున్న నాయకులు

కొందుర్గులో..

కొందుర్గు: మండల పరిధిలోని తంగెళ్లపల్లిలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోవర్ధన్‌గౌడ్, నాగరాజు, మల్లయ్య, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ శివశంకర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ జిల్లెల్ల రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

బురదమయంగా రహదారులు

● రోడ్డుపై వరి నారు వేసి నిరసన తెలిపిన గ్రామస్థులు



రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

చౌదరిగూడ: మండల కేంద్రం నుంచి పద్మారం గ్రామానికి వెళ్లే రోడ్డు రెండు రోజుల నుంచి కురుస్తున్న ముసురు వర్షానికి బురదమయంగా మారింది. పద్మారం, ఎల్కగూడెం గ్రామస్థులు ఆదివారం బురదమయంగా మారిన రోడ్డుపై వరినారు వేసి నిరసన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమా అని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన వారిలో వెం కటయ్య, భీమయ్య, యాదయ్య, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో 1983-84 సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. ఆనాటి ప్రధానోపాధ్యాయుడు బి. రామచంద్రయ్య, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, బాస్కరచారి, వీరభద్రం, లక్ష్మణ్‌రావు, అప్పటి డీఈవో స్వర్ణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక తరగతి గదిని దత్తత తీసుకొని ఫర్నీచర్‌ను సమకూర్చుతామని హామీ ఇచ్చారు. హరీష్ శర్మ, భవానీ శంకర్, శ్రీనివాస్, నర్సింలు, భక్తవత్సల్, జగన్నాథం, సుజన్‌సాగర్, జంగయ్య, అనురాధ, గీత పాల్గొన్నారు.

'కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి'

కొత్తూరు: షాద్‌నగర్ పట్టణంలో సెప్టెంబర్ 6న జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జాగృతి తాలుకా కన్వీనర్ గడ్డం సత్యనారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జయశంకర్, కాళోజీల జయంతిల సందర్భంగా ఎంపీ కల్వకుంట్ల కవిత కవులను గుర్తించాలనే ఉద్దేశంతో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ దేవేందర్ గౌడ్, నాయకులు జహంగీర్, శ్రీనివాస్ యాదవ్, బాలాజీ, ఉదయ్ పాల్గొన్నారు.

'భక్తుల కొంగు బంగారం ఫాతిమా మాత'

కొత్తూరు: భక్తుల కొంగు బంగారం ఫాతిమా మాత చర్చి అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. కొత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో గల ఫాతిమాపూర్‌లోని ఫాతిమా మాత చర్చి ఆవరణలో ఆదివారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర గల ఫాతిమా మాత చర్చికు ఎంతో ప్రాముఖ్యత ఉందని, చర్చిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో కొత్తూరు, తీగాపూర్ సర్పంచులు జనిగె జగన్, మెండె నర్సింహ్మ, పాస్టర్ అలెగ్జాండర్, పాఠశాల ప్రిన్సిపల్ సుజాత, స్థానికులు లూర్థ్‌రెడ్డి, అల్విన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చిన్నపురెడ్డి, పాపిరెడ్డి, ప్రాన్సిస్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, థామస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

'గ్రంథాల బహూకరణ అభినందనీయం'

షాద్‌నగర్: నిరుపయోగంగా ఉన్న విలువైన గ్రంథాలను గ్రంథాలయానికి దాతలు బహూకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. షాద్‌నగర్ గ్రంథాలయంలో చేపట్టిన గ్రంథాల సేకరణ కార్యక్రమ ముగింపు సమావేశం ఆదివారం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి. లక్ష్మీ నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై గ్రంథాలను బహూకరించిన దాతలను సన్మానించారు. గ్రంథాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహరెడ్డిని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జానకిరాములు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జూపల్లి శంకర్, జంగారి నర్సింహులు, ఆర్య యాదయ్య, గాదె సుధాకర్, అల్లాడ శేఖర్, అందె మహేశ్వర్, జంగరాజ్, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పిరమిడ్ ఆకారంలో విద్యార్థినుల ప్రదర్శన

సామాజిక రుగ్మతలను అరికట్టాలి

● సామాజిక సేవా సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్

కేశంపేట: సమాజంలో ఉన్న బాల్యవివాహాలు, బాణామతి, క్షుద్రపూజలు లాంటి సామాజిక రుగ్మతలను అరికట్టేందుకు యువతులు తమ కుటుంబాన్ని ప్రోత్సహించాలని వాయిస్ ఫర్ గర్ల్స్ సామాజిక సేవా సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కామాక్షి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేశంపేట కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఈనెల 11 నుంచి 20 ఆదివారం వరకు విద్యార్థులకు అందంపై అవగాహన, అంతర్‌శక్తి, బాహ్యశక్తి, ఆడపిల్లల శక్తి, నా అద్భుతమైన శరీరం, నెలసరి జాగ్రత్త, బాహ్య, అంతర్ సౌందర్యం, సంరక్షణ, ఇతరులతో మమేకం, హక్కుల గురించి తెలుసుకోవడం లాంటి విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్లంపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ నిరోశ, కేజీబీవీ ఎస్‌వో గౌసియాబేగం, కౌన్సిలర్స్ బిందు, కావ్య, తస్మియా, హిందు, రచన, కళ్యాణి, వార్డు మెంబర్ ధన్‌రాజ్ రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీ సెక్టార్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌అర్బన్: షాద్‌నగర్ పట్టణంలోని బీఎస్పీ క్రిష్టియన్‌కాలనీ సెక్టార్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులు గుండెటి నర్సింహులు ఆధ్వర్యంలో సెక్టార్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బానూరి చంద్రయ్య, ప్రధానకార్యదర్శిగా పరంజ్యోతి, కార్యదర్శులుగా భాగ్యమ్మ, రాములు, కిరణ్, రమేష్, కుమార్, శ్రీనివాస్, కాశన్న, జి. శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎంఎస్ఎఫ్ కమిటీ ఎన్నిక

షాద్‌నగర్‌టౌన్: షాద్‌నగర్ బాలికల కళాశాల హాస్టల్‌లో మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింలు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షులుగా రేణుక, ప్రధాన కార్యదర్శిగా శ్రీలత, కార్యదర్శిగా స్వాతి, సహాయ కార్యదర్శిగా సువర్ణ, ప్రచార కార్యదర్శిగా లలిత, అధికార ప్రతినిధిగా అనురాధలను ఎన్నుకున్నారు.

'మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి'

షాద్‌నగర్‌టౌన్: మధుమేహంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన వైద్యులు డాక్టర్ ప్రేమ్‌సాయి, శ్రవంతి సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్‌టౌన్, వాసవీక్లబ్, వనితాక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ అమరేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్, మహేందర్‌రెడ్డి, శాంతిలాల్, కవిత, రాంచందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, నేమ్‌చంద్, వాసవీక్లబ్ అధ్యక్షుడు నందకిశోర్, వనితాక్లబ్ అధ్యక్షురాలు రజిత, పోల శశిధర్ పాల్గొన్నారు.

జోరుగా ప్లాస్టిక్ విక్రయాలు

- దుష్ప్రబావాలపై కానరాని చైతన్యం
- హెచ్చరికలతో సరిపెడుతున్న అధికారులు
- ఒక వ్యక్తి ఏడాదిలో నాలుగు కిలోల ప్లాస్టిక్ వాడుతున్నట్లు సర్వేలో వెల్లడి

చేవెళ్లరూరల్: పర్యావరణానికి ఆవరోధం కల్గిస్తున్న వాటిలో ప్లాస్టిక్ చాలా ప్రమాదకరమని, దానివినియోగాన్ని తగ్గించాలని చెప్పడమే కానీ ఆచరణలో ఎవరు కూడా చిత్తశుద్ధితో చూపడం లేదు. ఎవరైనా ప్లాస్టిక్‌ను విక్రయించినా, నిల్వ ఉంచిన రూ, 500 నుంచి రెండు వేల వరకు జరిమానా విధిస్తామని ఆయా గ్రామపంచాయితీ కార్యదర్శులు నోటిసులు జారీ చేయడంతో పాటు హెచ్చరికలు చేయడమే తప్ప ఎక్కడా అమలు చేయడంలేదని పలువురు విమర్శిస్తున్నారు.

వాడకం ఎంతో తెలుసా....!

ప్రతి మనిషి ఒక ఏడాదిలో నాలుగు కిలోల ప్లాస్టిక్ వాడుతున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ఇలా దేశ వ్యాప్తంగా 30 లక్షల టన్నుల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, వాటర్ బాటీళ్లు, టీ కప్పులు ఉపయోగిస్తున్నారట, మన రాష్ట్రంలోనూ ప్లాస్టిక్ వాడకం 300 టన్నులకు మించి పోయిందట, నిత్యం గ్రామపంచాయితీ పారిశుధ్య కార్మికులు సేకరించే చెత్తలో 5 శాతనికి పైగా ప్లాస్టిక్ కవర్లే ఉంటున్నాయని ఆ సర్వే చెబుతోందని పలువురు పర్యవరాణావేత్తలు పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్‌తో నష్టం ఇలా...

పర్యావరణ వినాశకనకారిగా చెప్పుకుటుంటున్న ప్లాస్టిక్‌తో చాలా నష్టాలే ఉన్నాయి. ప్లాస్టిక్ కవర్లు వర్షపు నీరు భూగర్భంలోకి చేరకుండా అడ్డుకుంటాయి. ప్లాస్టిక్ కప్పులతో వేడి పదార్థాలు తీసుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటిని తగలబెట్టడం వల్ల డైయాక్సిన్ వాయువు గాలిలోకి చేరి కూడా క్యాన్సర్ రావచ్చంటున్నారు. పశుగ్రాసం దొరక్క కొన్ని సందర్భాల్లో పశువులు ప్లాస్టిక్ కవర్లను తినడం మనం చూస్తుంటాం. ఇలా తింటున్న మూగజీవాలెన్నో ప్రాణాలు వదులుతున్నాయి. వాటి మాంసం తింటే ప్రజలు రోగాల బారిన పడటం ఖాయం, వీధుల్లో పడేసిన ప్లాస్టిక్ కవర్లు వర్షం నీటిలో కట్టుకుపోయి చెరువులు, కుంటల్లో చేరతాయి. అవి చేపలు, ఇతర జల చరాలు తింటే చనిపోతాయి, ప్లాస్టిక్ తయారీలో బీపీఏ అనే రసాయనం వాడతారు. ప్లాస్టిక్ బాక్స్‌లలోని ఆహారం తింటే ఆరోగ్యంపై అనేక దుష్ప్రబావాలు చూపుతాయి. చిన్నపిల్లలు ప్లాస్టిక్ వస్తువులను నోటిలో పెట్టుకుంటే ప్రమాదమని ప్లాస్టిక్ బాటీల్లో పోసిన వేడి పాలు తాగితే ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.





చేవెళ్లలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు

నివారణకు మార్గం లేదా

- ప్లాస్టిక్ నిషేధంపై మొదట ప్రజల్లో బాగా చైతన్యం తీసుకురావాలి.
- వీలైనంత వరకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తే మంచిది.
- తప్పని పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవరు వాడాల్సి వస్తే 20 మైక్రాన్ల కన్నా ఎక్కువ మందం ఉండేవి ఉపయోగించాలి.
- ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగించాల్సి వస్తే బీపీఏ ఫ్రీ, మైక్రోవేవ్ సేఫ్ అని రాసున్నవే వాడాలి.
- కవర్లు బహిరంగా ప్రదేశాల్లో పడేయటం మంచిది కాదు. వాటిని మూగజీవాలు తినే ప్రమాదం ఉంది.
- ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలను తోటివారికి తెలియజేయాలి
- నిషేధాన్ని ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా బావిస్తే ప్లాస్టిక్‌ను తరిమికొట్టడం చాలా సులభం.
- ప్లాస్టిక్ వాడినా, అమ్మినా, నిల్వ ఉంచినా చర్యలు కఠినంగా ఉంటే కొంతమేర తగ్గించవచ్చు.

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి ..

చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే చేవెళ్ల పట్టణ కేంద్రంలోని దుకాణాలకు పంచాయితీ కార్యదర్శితో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని నోటిసులు ప్రతి దుకాణంకు అందించాం. వ్యాపారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ అమ్మకాలు చేయకుండా చూస్తాం. తర్వాత కూడా ప్లాస్టిక్ వాడితే అప్పుడు జరిమానాలు విధిస్తాం.

- ఎంపీడీవో రత్నమ్మ, చేవెళ్ల

నేడు సూర్య గ్రహణం



శ్రావణ చివరి సోమవారం, గ్రహణం కలిసి రావడంతో అత్యంత విశిష్టత • మిట్టమధ్యాహ్నం 2 నిముషాల పాటు చీకటిమయం • అంతరిక్షంలో ఆవిష్కృతం కానున్న అద్భుతం • సకల శక్తులు లింగరూపంలో కొలువై ఉండే రోజు ఇది • లింగార్చన, మహా పాశుపత హోమం చేయడం పుణ్యదాయకం • మన దేశంలో కనిపించే అవకాశం లేదు


శ్రావణ మాసం, అందులోనూ ఆఖరి సోమవారం, ఇదే రోజున సూర్య గ్రహణం ఉండడం... ప్రస్తుతం ఎక్కడ చూసినా చర్చనీయాంశంగా మారింది. రేపు సూర్య గ్రహణం ఉండడంతో ఈ రోజున ఏం చేయాలి, ఎలాంటి నియమాలను పాటించాలి, ఏఏ పూజలు నిర్వహించాలనే విషయాల పై ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. దీనిపై రకరకాల ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రేపటి సూర్య గ్రహణం విశేషాలు, దాని వల్ల కలిగే ఫలితాలు, ఏఏ రాశుల వారికి ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

వికారాబాద్ (ఫీచర్స్)

మహా శివరాత్రి కంటే పవిత్రం సోమావతి అమావాస్య

శ్రావణ మాసంలో చివరి సోమవారం కావడం, అదే రోజున సూర్య గ్రహణం ఉండడం వల్ల ఈ రోజును సోమావతి అమావాస్యగా పరిగణిస్తారు. ఈ రోజుకు చాలా విశిష్టత ఉందని, మహాశివరాత్రి కంటే కూడా పవిత్రమైనదని పండితులు చెబుతున్నారు. ఈ రోజున సకల శక్తులు లింగరూపుడైన శివుడిలో కొలువై ఉంటాయట. ముక్కోటి దేవతలు, సప్త రుషులు, నవగ్రహాలు సైతం ఈ రోజున మహాశివుడిని ఆరాధించేందుకు ఎదురుచూస్తుంటారని శాస్త్ర గ్రంథాల్లో రాసి ఉందని పండితులు పేర్కొంటున్నారు. మహా శివపురాణంలోనూ దీని గురించిన ప్రస్తావన ఉందని వారు తెలిపారు. కాబట్టి ఈ రోజున భక్తులు లింగార్చన, మహాపాశుపత హోమం నిర్వహించడం అత్యంత శుభప్రదమని వారంటున్నారు. పూజల అనంతరం భక్తులు అక్షింతలను చేతితో పట్టుకొని నీటితో తడిపి... 'అనేనా మయాకృతేనా సమస్త పూజా ఫలం శ్రీ గణపతిదేవతార్పణమస్తు'...అంటూ స్వామివారి పాదాల వద్ద సమర్పించడం వల్ల భవిష్యత్తులో అంతా శుభం జరుగుతుందట. అంతే కాకుండా గతంలో చేసిన పాపాలు తొలగిపోయి అఖండ ఫలితం సిద్ధిస్తుందట.

గ్రహణ పూజలకు విశేష ఫలితం



సాధారణంగానే గ్రహణం రోజున చేసే పూజా కార్యక్రమాలకు సాధారణ రోజులతో పోలిస్తే కోటి రెట్ల ఫలితం దక్కుతుందని పండితులు చెబుతున్నారు. ఈ రోజున నిర్వహించే పూజ సాఫల్యం అవుతుందట. అందుకే మంత్రోపదేశం ఇవ్వాలన్నా, తీసుకోవాలన్నా గ్రహణం రోజునే చేపడతారని వివరిస్తున్నారు. అందులోనూ సోమావతి అమావాస్య రోజున చేసే పూజలు మరింత ఫలాన్నిస్తాయని చెబుతున్నారు.

మన దేశంలో కనిపించే అవకాశం లేదు

సోమవారం నాటి సూర్య గ్రహణం మన దేశంలో కనిపించే అవకాశం లేదు. కేవలం ఉత్తర అమెరికా వాసులకు మాత్రమే ఈ గ్రహణాన్ని వీక్షించే అవకాశం దక్కనుంది. అయిప్పటికీ సూర్యుడికి గ్రహణ స్థితి కనిపిస్తుంది కాబట్టి పూజాధికాలు, లింగార్చన తదితర కార్యక్రమాలు అనుసరించవచ్చు. గ్రహణ సమయంలో మంత్ర ఉచ్చారణ, భగవంతుడి నామస్మరణ చేయడం మంచిదని చెబుతున్నారు. అయితే భోజనాలు మానుకోవాల్సిన అవసరం లేదని పండితులు సూచిస్తున్నారు. గ్రహణ ప్రభావం ప్రజలపై చాలా తక్కువగా ఉంటుందని, భౌగోళిక స్థితిపైనే ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. అయితే దూరప్రయాణాలు, ఇతరత్రా పనుల నిర్వహణలో మాత్రం జాగ్రత్త వహించడం మంచిదని సూచిస్తున్నారు.

మిట్టమధ్యాహ్నం 2 నిముషాల పాటు చీకటి

సోమవారం అంతరిక్షంలో ఒక అద్భుత సన్నివేశం ఆవిష్కృతం కానుంది. సూర్య గ్రహణం కారణంగా మిట్టమధ్యాహ్నం వేళ 2 నిముషాల పాటు మొత్తం చీకటిమయం కానుంది. ఈ సుందర దృశ్యాన్ని కనులారా వీక్షించడానికి ప్రజలంతా ఉత్సాహంతో ఎదురుచూస్తున్నారు.

ఈ రాశుల వారు జాగ్రత్తగా ఉండాలి

సూర్య గ్రహణం రోజున కర్కాటకం, సింహం, ధనుస్సు, సింహ రాశుల వారు జాగ్రత్తగా ఉండాలి. ఈ రాశుల వారు బ్రాహ్మణులకు స్వయం పాకం చేసి పెట్టడం, భగవంతుడిని ఆరాధించడం, లింగార్చన చేయడం, చేతనైన దానాలు చేయడం వల్ల గ్రహణ దోషాలు తొలగుతాయి. అంతేకాకుండా పుణ్యం దక్కుతుంది. గర్భిణీలు గ్రహణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి.

-రఘురామాచార్యులు, వికారాబాద్



సొంతింట్లోనూ.. పరాయే!



● చరమాంకపు జీవనగీతంలో చీదరింపులు ● పిల్లల ఆదరణకు నోచక తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
● వృద్ధుల సంక్షేమానికి అనేక చట్టాలు ● చట్టాలెన్ని ఉన్నా మానవత్వమే మార్గం

నేడు జాతీయ వృద్ధుల దినోత్సవం

వికారాబాద్ (ఫీచర్స్) : జీవన పయనంలో ఎన్ని బాధలు పడ్డారో, కుటుంబ పోషణకు ఎన్ని కష్టాలు పడ్డారో, కన్నబిడ్డల బాగు కోసం ఎన్నెన్ని ఎదురు దెబ్బలు తిన్నారో, నిద్ర లేని రాత్రులెన్ని గడిపారో, పిల్లల చదువులు, ఎదుగుదలకు ఎన్ని వ్యవ, ప్రయాసలకు ఓర్చుకున్నారో.. కనీ పెంచీ, ప్రేమను పంచి, విద్యాబుద్ధులు నేర్పించి, సమాజాన్ని చూపించి, రెక్కలొచ్చే దాకా సాకి, బిడ్డల హృదయం తల్లడిల్లితే తల్లి గుండె ఎంతగా విలపించిందో, తండ్రి మనసు ఎంతగా రోధించిందో.. అంతగా తమ సంతానాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న వారు తీరా వయసు మీదపడ్డాక నిరాదరణకు గురవుతున్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదుకోవాల్సిన తనయులు వారిని భారంగా భావిస్తున్నారు. సొంతింట్లోనే వారిని పరాయి వారిని చేస్తున్నారు. ముదిమి వయసులో తల్లి దండ్రులకు అండదండగా నిలవాల్సిన తనయులే చేయిపట్టి వారిని గడప దాటించి భయటకు గెంటేస్తున్నారు. నేడు జాతీయ వృద్ధుల దినోత్సవం (సీనియర్ సిటిజన్స్ డే) సందర్భంగా ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో వృద్ధులు పడుతున్న కష్టాలు, వారి సంక్షేమం కోసం అమల్లో ఉన్న చట్టాలు.. తదితర విశేషాలతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం....

నేటిసమాజంలో ఆదరణ కరువవుతున్న వృద్ధులు

జీవన పయనంలో ఎన్నో ఆటుపోట్లు, బాధలు, కష్టనష్టాలను తట్టుకొని, క్లిష్ట పరిస్థితులకు ఎదురీది కన్నబిడ్డల బాగోగులే జీవితంగా భావించిన తల్లిదండ్రులకు చరమాంకపు జీవితంలో ఆదరణ కరువైంది. కని, పెంచి, పెద్ద చేసి, ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి పెద్ద చదువులు చదివించి ఉన్నత స్థాయికి తెచ్చిన అమ్మా, నాన్నలకు వయసు మీద పడ్డాక కనీస మర్యాద కూడా లభించడం లేదు. తల్లిదండ్రులపై కనీస దయా, దాక్షిణ్యాలు లేకుండా ఇళ్ల నుంచి తరిమేస్తున్న ఘటనలు మనం ఇటీవలి కాలంలో చాలానే చూస్తున్నాం. కంటికి రెప్పలా కాపాడిన వారిని వారి పుత్రరత్నాలు నిలువ నీడ లేకుండా చేస్తున్నారు. ముదిమి వయసులో మమతానురాగాలతో తడిమి చూడాల్సిన తనయులు అవే చేతులతో వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. వృద్ధాప్యం దరిచేరగానే సొంతింట్లోనే వారిని పనివాళ్ల కన్నా హీనంగా చూస్తున్నారు.

తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు

జీవిత చరమాంకంలో తమ పిల్లల ఆదరణ కరువై ఎంతో మంది వృద్ధులు తల్లడిల్లుతున్నారు. చివరి రోజుల్లో కన్న కొడుకుల ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్న పండుటాకులు తమ వారే తమను పట్టించుకోకపోవడం చూసి అల్లాడిపోతున్నారు. శారీరకంగా ఏ రోగం లేకపోయినా మానసికంగా కుంగిపోతున్నారు. పున్నామ నరకం నుంచి తప్పిస్తారో లేదోగానీ, బతికి ఉండగానే అమ్మా, నాన్నలకు నరకాన్ని చూపెట్టకుండా ఉంటే చాలు.. అన్న పరిస్థితి నేటి సమాజంలో కొట్టొచ్చినట్లుగా కనబడుతోంది. కొద్దిసేపు వాళ్ల పక్కన కూర్చొని ప్రేమతో, ఆప్యాయతతో మాట్లాడితే చాలు వారి ఆనందానికి అవధులు ఉండవు. కానీ ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో ఎక్కడో తప్ప ఈ దృశ్యాలు కనిపించడం లేదు. నేటి పిల్లలే రేపటి తల్లిదండ్రులన్న వాస్తవం చాలామంది గ్రహించడం లేదు.

వృద్ధుల కోసం అమలులో ఉన్న చట్టాలు

వృద్ధాప్యంలో తమ పిల్లల నుంచి నిలవునీడతో పాటు వైద్య, ఆరోగ్య సేవలు, కోరిన సౌకర్యాలు పొందడాన్ని ఓ హక్కుగా గుర్తిస్తూ ప్రభుత్వం అనేక చట్టాలు అమలులోకి తెచ్చింది. పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తమ తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోని తరుణంలో చట్టప్రకారం వారి నుంచి సంబంధిత సేవలు పొందేలా చట్టాలను రూపొందించింది. దహిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ చట్టం 1956, తల్లిదండ్రుల సంరక్షణ చట్టం సెక్షన్ 125 సీఆర్‌పీసీ ప్రకారం.. వృద్ధాప్యంలో ఉన్న ఉన్న తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోని తరుణంలో వారు కోర్టును ఆశ్రయించే అవకాశాన్ని ప్రభుత్వం అప్పట్లోనే కల్పించింది. ఈ చట్టం ప్రకారం వృద్ధులకు న్యాయం జరగాలంటే ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రావడం, భారీగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుండడంతో ఆచరణలో సఫలం కాలేకపోయింది. ఈ కారణంగా ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమం, సంరక్షణ చట్టాన్ని(సీనియర్ సిటిజన్ యాక్ట్) అమలులోకి తెచ్చింది. 1956లో అమలులోకి వచ్చిన చట్టానికి పూర్తి భిన్నంగా ఎలాంటి ఖర్చు లేకుండా, కేవలం రోజుల వ్యవధిలోనే వృద్ధులకు న్యాయం జరిగేలా ఈ చట్టాన్ని రూపొందించారు. దీని ప్రకారం తల్లిదండ్రులు లేదా వృద్ధులు తాము కోరుకున్న విధంగా అవసరమైన సౌకర్యాలు, సేవలను పిల్లలు తప్పనిసరిగా కల్పించాల్సి ఉంటుంది. అవసరమైన ఆరోగ్య సేవలను అందించాల్సి ఉంటుంది. వారికి ప్రాణరక్షణ కల్పించడంతోపాటు ఆస్తులను కూడా పరిరక్షించాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం సంతానం లేని వారు కూడా వృద్ధాప్యంలో తమకు తగిన సాయం అందించాలంటూ ప్రభుత్వాన్ని కోరే వెసులుబాటు కల్పించారు. వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నవారికి ఈ చట్టం ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది దీనిని వినియోగించుకోలేకపోతున్నారు.

చట్టాలెన్ని ఉన్నా మానవత్వమే మార్గం

ఎన్ని చట్టాలు అమలులో ఉన్నా కూడా పిల్లలు తమ తల్లిదండ్రుల పట్ల ప్రేమానురాగాలు కలిగి మానవత్వంతో వ్యవహరిస్తేనే వృద్ధాప్యంలో వారి జీవన స్థితిగతులు మెరుగుపడతాయనేది సుస్పష్టం. ప్రభుత్వం అమలుచేస్తున్న చట్టాల ప్రకారం. పిల్లలు తమ తల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోని పక్షంలో చట్టం వారిని శిక్షిస్తుంది. అయితే సమాజంలో తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలు చాలా మంది ఉంటారు కానీ పిల్లలను శిక్షించాలని కోరుకునే తల్లి దండ్రులు మాత్రం ఎక్కడా ఉండరనేది కాదనలేని సత్యం. ఈ కారణంగా ఎన్ని చట్టాలున్నా తమ పిల్లలకు శిక్ష వేయాలంటూ వాటిని ఆశ్రయించే తల్లిదండ్రులు చాలా తక్కువగా ఉంటారనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. చాలా సంఘటనల్లో ఈ అంశం రుజువైంది కూడా. దీనినిబట్టి పిల్లలపై తల్లిదండ్రులకు ఎంత మమకారం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నీలి విప్లవానికి వరుణ గండం

● చెరువులకు దూరమైన చేపలు..
● వర్షాల్లేక నిండని చెరువులు
● నీరున్న చెరువుల్లో వదలని చేపలు
● శేరిగూడలో నిరుపయోగంగా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం
● పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ :

నీలి విప్లవానికి 'వరుణ' గండం పట్టుకుంది. వర్షాలు లేక, చెరువులు నిండక చేపపిల్లలను వదిలే కార్యక్రమం నిలిచిపోయింది. ఈ ఏడాది మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 1314 చెరువులు, కుంటల్లో కోటి 40 లక్షల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా పెట్టుకోగా.. నేటికీ ఒక్క చెరువులో కూడా చేప పిల్లలను వదలలేని దుస్థితి నెలకొంది. అదును దాటి పోతుండటంతో మత్స్యకారుల్లో తీవ్ర నిరాశ అలుముకుంటున్నది. చేపల పెంపకంపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. నీలి విప్లవం పేరిట గత ఏడాది నుంచి వంద శాతం సబ్సిడీపై చేపపిల్లలను అందజేస్తుంది. ఈ పథకం వల్ల మత్స్యకారలకు జీవనోపాధితో పాటు చేపల ఉత్పత్తి పెరిగి, ప్రజలకు పౌష్టికారహారం అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో గతేడాది వర్షాకాలం ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినా ఏర్పాట్లలో జాప్యం వల్ల చెరువుల్లో చేపప్లిలను వదిలే కార్యక్రమాన్ని ఆలస్యంగా ప్రారంభించారు. గత ఏడాది 16 లక్షల చేప పిల్లలను చెరువులో వదిలారు. చెరువుల్లో నీరు తగ్గే సమయానికి చేపలు ఆశించిన స్థాయిలో నీరు పెరగలేవు. దీంతో మత్స్యకారులకు గిట్టుబాటు లభించలేదు. ఈ సారి ముందుగానే వర్షాలు మురిపించాయి. ఈ సంవత్సరం చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరితే అన్ని చెరువుల్లోకి చేప విత్తనాలు వేయాలని నిర్ణయించింది. కోటి నలభై లక్షల చేపపిల్లలను పంపిణీ చేసేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. మార్కెట్లో ఉన్న డిమాండ్ మేరకు బొచ్చ, రవు, బంగారు తీగ, మెరగ నాలుగు రకాల చేపపిల్లలను ఎంపిక చేసింది. ప్రస్తుతం కడ్తాల, కేశంపేట, షాద్ నగర్ చెరువులోకి నీరు చేరింది. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో ఇంకా నీరు చేరలేదు. కానీ.. హయత్‌నగర్‌పరిధిలోని హనాజ్‌పూర్, శంషాబాద్ మండల పరిధిలోని పాల్మాకుల చెరువులోకి నీరు చేరింది. అలాగే షాబాద్ మండలం పహిల్వాన్ చెరువులో నీరు పుష్కలంగా చేరింది. నీరు చేరిన చెరువుల్లో కూడా ఇంకా చేప విత్తనాలు వదల్లేరు. ఈ సారి 34 నుంచి 40 ఎంఎం సైజు గల చేప విత్తనాలను మత్స్యకారులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. రంగారెడ్డి జిల్లాలో సుమారుగా 1314 చెరువులు, కుంటలు ఉండగా ఒక రిజర్వాయరు, 1200 చిన్న చెరువులు ఉండగా అందులో 114 చెరువులు మత్స్య శాఖ ఆధీనంలో ఉన్నాయి. మిగతా చెరువులన్నీ పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలో ఉన్నాయి. ఈ చెరువులన్నీ వర్షాలపై ఆధారపడి ఉన్నాయి. అదే విధంగా జిల్లాలో 72 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా అవన్నీ మత్స్యశాఖ ఆధీనంలోని పనిచేస్తున్నాయి. చెరువులను నామినల్ కౌలుపై మత్స్య సంఘాలకు ప్రతి సంవత్సరం చేపల పెంపకం కోసం ఇస్తున్నారు. అలాగే 7 మహిళా పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 350 మంది సభ్యత్వం పొంది ఉన్నారు. ఇందులో 5 మత్స్య మిత్ర గ్రూపులు కూడా ఉన్నాయి. ఈ సంఘాలు చేపలు అమ్ముకుంటున్నాయి. ఈసారి మత్స్యకారులపై ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షాకాలం ప్రారంభం రెండు నెలలు అవుతన్నా...నేటికి చెరువుల్లోకి నీరు రాలేదు. దీంతో ఆందోళన చెందుతున్నారు. వరుణుడు ముఖం చాటేయడంతో చెరువుల్లోకి ఆశించిన మేరకు నీరు చేరలేదు. ప్రస్తుతం మత్స్యకారులు వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

నిరుపయోగంగా చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం..

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, శేరిగూడ గ్రామాల మధ్య చేపపిల్లల పెంపకం కోసం ఏర్పాటు చేసిన విత్తన ఉత్పత్తి కేంద్రం గత మూడేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తుంది. 45 లక్షల చేపపిల్లలను ఉత్పత్తి చేసే సామర్థ్యం గల దీనిని వినియోగంలోకి తీసుకురావటం లేరు. మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని చెరువుల్లో వదడానికి కావాల్సిన చేప పిల్లలను ఇతర జిల్లాల నుంచి తెప్పిస్తున్నారు. మూడెకరాల్లో తొమ్మిది సిమెంట్ నర్సరీలు, 14 మట్టి నర్సరీలున్నాయి. నీటి అవసరాల కోసం ప్రత్యేకంగా బోరు వేసినా ఆ బోరు ప్రస్తుతం మరమ్మత్తులకు నోచుకోవటం లేదు. గతంలో బంగారు తీగ సీడ్‌ను ఇక్కడే ఉత్పత్తి చేసేవారు. బొచ్చె, రోహు, మిరిగాల సీడ్‌ను తీసుకు వచ్చి పెంచేవారు. ఇక్కడ పెంచిన చేప పిల్లలను ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం మత్స్య కారుల సొసైటీలకు, కార్మికులకు విక్రయించేవారు. మూడేళ్లుగా ఉత్పత్తి కేంద్రం పనితీరు అస్తవ్యస్తంగా మారింది. అధికారులు పట్టించుకక పోవటంతో కేంద్ర నిరుపయోగంగా మారింది.

తస్మాత్ జాగ్రత్త

బంగారం దొరికింది..! కొంటారా..?
షాద్‌నగర్ వ్యాపారులకు ఫోన్‌కాల్స్

షాద్‌నగర్ : తవ్వకాల్లో దొరికిన బంగారం కొంటారా...? అంటూ షాద్‌నగర్ వ్యాపారులకు ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. సగం ధరకే నాణ్యమైన బంగారం ఆశచూపి బురిడీ కొట్టించాలని ఓ అగంతకుడు ప్రయత్నాలు చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం వచ్చిన ఫోన్‌కాల్స్ తిరిగి పునరావృతమవుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని ఓ ప్రముఖ వ్యాపారికి గతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌కాల్ చేశాడు. మాది కర్ణాటక రాష్ట్రం హుబ్లీ ప్రాంతం.. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ప్లాట్లు ఇచ్చింది. నా పక్క ప్లాటులోని వృద్ధులు పునాదులు తీస్తుంటే బంగారం దొరికింది. డబ్బు తీసుకుని హుబ్లీ రైల్వే స్టేషన్‌కు వస్తే సగం ధరకే ఇస్తామని చెప్పాడు. మాయమాటలతో తనను మోసం చేయడానికే ఫోన్ చేశాడని గ్రహించిన సదరు వ్యాపారి అతన్ని మందలించి ఫోన్ కట్‌చేశాడు. అదే వ్యాపారికి ఆదివారం మధ్యాహ్నం కూడా (8722063763) ఫోన్‌కాల్ వచ్చింది. అన్నా నన్ను గుర్తు పట్టారా..? నెల రోజుల క్రితం వచ్చి మిమ్ముల్ని కలిసిపోయాను. హుబ్లీ ప్రాంతంలోని ఓ పురాతన దేవాలయం వద్ద తవ్వకాలు జరుపుతుంటే బంగారం దొరికింది. స్వచ్ఛమైన బంగారం.. డబ్బు తీసుకుని హుబ్లీ రైల్వే స్టేషన్‌కు వస్తే సగం ధరకే ఇస్తాం.. అంటూ సంభాషణను పొడిగించగా... ఇంతకీ నీవెవరు.. నా ఫోన్ నెంబరు ఎవరిచ్చారు.. నేను బంగారం కొంటానని ఎవరు చెప్పారు.. మళ్లీ ఫోన్‌చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించడంతో ఫోన్ కట్‌చేశాడు. ఫోన్ నెంబర్‌ను ట్రూకాలర్‌లో పరిశీలిస్తే ఎస్‌ఆర్ షాలోమ్, కర్ణాటక అని వస్తున్నది. వ్యాపారుల ఫోన్ నెంబర్లను చేజిక్కించుకుని, మాయమాటలతో బురిడి కొట్టించాలని ప్రయత్నిస్తున్న అగంతకుడి మాయలోపడి అమాయకులు, అత్యాశపరులు మోసపోవద్దని సదరు వ్యాపారులు ఆంధ్రజ్యోతికి సమాచారం ఇచ్చారు.

జంబ్లింగ్ వర్డ్స్

1. WLKA ▸ ....
2. NGKI ▸ ....
3. DMBU ▸ ....
4. MEUT ▸ ....

జంతర్‌మంతర్

1. ద్భుఅతం ▸ ....
2. తణంక్ష ▸ ....
3. త్తిడిఒ ▸ ....
4. సంవికా ▸ ....

చెప్పగలరా?

పాలులో ఉన్నా కానీ వేలులో లేను
యతిలో ఉన్నా కానీ గతిలో లేను
సందులో ఉన్నా కానీ విందులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

సూక్తి

మనం ఉన్నతంగా ఎదగడానికీ, నష్టపోవడానికీ కారణం మన ఆలోచనలే.

రోబోల రికార్డ్ బ్రేక్ డ్యాన్స్

రోబో స్టెప్పు వేస్తే.. అదిరి పోతుంది కదూ! మరి ఒకేసారి వెయ్యికి పైగా రోబోలు కదం తొక్కితే.. డ్యాన్సులు చేసి అదరగొడితే అద్భుతం కదా! ఒకే సైజులోని రోబోలన్నీ కాలంలో ఒకే రీతిలో డ్యాన్స్ చేసి 'గిన్నిస్ పుటల్లో' స్థానం పొందాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పరిచిన 1069 రోబోలు విభిన్నంగా డ్యాన్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రపంచ రికార్డును సాధించి గిన్నిస్ పుటలకెక్కాయి. డబ్యు.ఎల్ ఇంటిలెజెంట్ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ వీటిని రూపొందించింది. 'వన్ గ్రూప్ కంట్రోల్ సిస్టమ్' ప్రోగ్రామ్ ఆధారంగా ఇవి ఏకకాలంలో డ్యాన్స్ చేశాయి. చిందులతో కదం తొక్కిన ఆ రోబోల పేరు 'దోబి'. చైనాలో గతంలో జరిగిన బీర్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో 1007 రోబోలు బ్రేక్ డ్యాన్స్ చేసి గిన్నిస్ రికార్డు సృష్టించాయి. ఆ రికార్డును 'దోబి' రోబోలు ప్రస్తుతం బద్దలుకొట్టాయి. ఈ దోబి రోబోల ఎత్తు - 47.3 సెంటిమీటర్లు. ఇవి పాటలు పాడటంతో పాటు, ఫుట్‌బాల్ కూడా ఆడతాయి. కుంగ్‌ఫూ కూడా చేయడం విశేషం. వీటి డ్యాన్సింగ్ వీడియోను యూట్యూబ్‌లో గంట వ్యవధిలోనే లక్షల మంది చూశారు.



మీకు తెలుసా?

షాంగై ఎక్స్‌పో పార్క్‌లో గత సంవత్సరం జరిగిన 'ఫ్రాన్స్ నేషనల్ పెవిలియన్ డే'లో సందర్శకులను అలరించేందుకు నిర్వాహకులు 20 రోబోలతో డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతేకాదు వాటితో సాకర్ కూడా ఆడించారు.



'రోబో' స్టెప్పుల రికార్డు

ప్రభుదేవా డ్యాన్స్ మెరుపులు, చిరంజీవి స్టెప్పులు అందరికీ తెలుసు. మరి చిందులేసే రోబోలు తెలుసా? చైనా కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 540 రోబోలు ఒకే వేదికపై డ్యాన్సులు చేసి అలరించాయి. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక మంది వీక్షించిన టీవీ ప్రోగ్రామ్‌గా అది రికార్డులకెక్కింది. రోబోలు చిందేస్తుంటే 26 డ్రోన్లు ఆ నృత్యాన్ని వీడియో తీశాయి. చైనా సెంట్రల్ టెలివిజన్(సీసీటీవీ) ఈ కార్యక్రమాన్ని ప్రసారం చేయగా 70 కోట్ల మంది వీక్షించటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ప్రజలు చూసిన కార్యక్రమంగా రోబో డ్యాన్స్ నిలిచింది. సాహిత్యాన్ని, సంగీతాన్ని అనుసరించి కొరియోగ్రాఫర్లు డ్యాన్స్ కంపోజ్ చేస్తారు. అదే విధంగా రోబోలు సంగీతానికనుగుణంగా నృత్యం చేసేలా వీటిని రూపొందించారు. 'ప్రతి రోబోలో 16 స్టీరింగ్ ఇంజిన్లు ఉన్నాయి. మానవుడి తల, కాళ్లు, చేతులు ఏ విధంగా అయితే కదుపుతారో అదే విధంగా రోబోలు కదలడానికి వీలుగా ఈ స్టీరింగ్ ఇంజిన్స్ ఉపయోగపడతాయి.

రోబోట్ డ్యాన్స్

రోబోలను ఇమిటేట్ చేస్తూ చేసే డ్యాన్సే 'రోబోట్ డ్యాన్స్'. మైఖేల్ జాక్సన్‌తో ఈ డ్యాన్స్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 'డ్యాన్సింగ్ మెషిన్' పాటలో - మైఖేల్, తన సోదరులతో కలిసి 'రోబోట్ డ్యాన్స్' చేశారు. 'బిల్లి జీన్' అనే పాటలో కూడా 'రోబోట్ డ్యాన్స్' చేసి అలరించాడు.


మెల్‌బోర్న్ యూనివర్సిటీలో 'రోబోగాల్స్' అనే బృందం, 318 మంది 'రోబోట్ డ్యాన్స్' చేసి వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.

ఔనా!



వాసన పసిగట్టే శక్తి శునకాల కన్నా, చీమలకే ఎక్కువ.

బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్

అప్పారావు : ఏరా! వెళ్లినప్పుడు నాలుగు గంటల్లో విజయవాడ వెళ్లావు కదా! వచ్చేటప్పుడు ఎనిమిది గంటలు పట్టిందేం?

సుబ్బారావు : కారు తయారు చేసిన వెధవ ఎవడో గానీ, ముందుకు వెళ్లడానికి నాలుగు గేర్లు ఇచ్చాడు. వెనక్కి రావడానికి రెండు గేర్లు మాత్రమే ఇచ్చాడు రా!

అప్పారావు : !!!!!!!!!

టంగ్ ట్విస్టర్స్

1. Upper roller lower roller Upper roller lower roller. ..
2. Swan swam over the sea,
   Swim, swan, swim!
   Swan swam back again
   Well swum, swan!
3. I saw a saw that could out saw any other saw I ever saw.

చుక్కలు కలపండి



మీకు తెలుసా?



ప్రపంచంలో రెండు శాతం మందికి మాత్రమే ఆకుపచ్చ రంగు కళ్లు ఉంటాయి.

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ : 1. WALK 2. KING 3. DUMB 4. MUTE
జంతర్‌మంతర్ : 1. అద్భుతం 2. తక్షణం 3. ఒత్తిడి 4. వికాసం
చెప్పగలరా? : పాయసం

విజయవంతమైన 2వ వారం



ASIAN LAXMIKALA CINEPRIDE - మూసాపేట్ 11.15,2.30,6.15,9.30

ASIAN GPR MULTIPLEX KUKATPALLY - కూకట్‌పల్లి 10.40,1.30,7.30,10.30

ASIAN అత్తాపూర్ 10.40,1.40,4.20,7.40,10.30

ASIAN RADHIKA కాప్రా 10.30,1.25,7.25,10.30

ASIAN SHIVA GANGA దిల్‌సుఖ్‌నగర్ 11.15,6.00,9.00

ASIAN CINE SQUARE UPPAL - ఉప్పల్ 10.30,1.30,4.40,7.20,10.20

ASIAN SHAH SHAHENSHAH ఎ/సి - చింతల్ 11.15,6.15

PRASADS 10.45,2.30,5.00,7.30,10.30

PVR INORBIT MALL 10.20,1.30,4.40,7.50,11.00

PVR RK COMPLEX బంజారాహిల్స్ - 10.30,7.30,11.00

PVR CENTRAL MALL ఎ/సి - 10.20,1.30,7.50,11.00

PVR FROUM MALL 10.20,11.15,1.30,4.40,7.50,10.20,11.00

INOX GVK 11.15,1.00,4.10,7.25,10.40

INOX 10.50,12.55,4.00,7.05,10.10

BIG Cinemas AMEERPET 10.10,4.00,7.10,10.20

BIG Cinemas SHAMEERPET ఎ/సి - 10.50,4.30,7.10,10.30

Cinépolis KUKATPALLY 11.10,1.50,4.30,7.15,10.25

Cinépolis CCPL - MALKAJGIRI 10.10,1.15,4.20,7.25,10.30

Cinépolis ATTAPUR 10.40,1.40,4.20,7.40,10.30

TIVOLI SECUNDERABAD ఎ/సి - 1.20,7.00,10.15

Cine Planet కోంపల్లి 10.30,1.30,4.30,7.30,10.20

MIRAJ CINEMAS 11.30,2.30,8.00,11.00

ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్ 2.00,6.15,9.00

BVK MULTIPLEX L.B.NAGAR 11.00,4.30,7.30,10.00

ASIAN - హన్మకొండ 10.40,1.40,4.40,7.30,10.25

GEETHA ASIAN - నిజామాబాద్ 10.30,1.30,4.20,7.20,10.30

- వరంగల్ 12.45,3.55,7.05,10.15

SVC ప్రతిమ - కరీంనగర్ 11.00,7.35

శాంతి 70 - నారాయణగూడ 11.15,2.15,6.00,9.00

అర్జున్ - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00

ప్రశాంత్ - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00

SVC **మహాలక్ష్మి** కాంప్లెక్స్ - కొత్తపేట 11.15,2.15 PM

రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15

సంపూర్ణ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15

శ్రీదేవి - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15

శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట 11.00,2.00,6.00,9.00

నాగేంద్ర - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

రాజ్యలక్ష్మి ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00

రంగ 70 ఎ/సి - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00

శారద 70 ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00

స్వప్న 70 ఎ/సి - కాటేదాన్ 11.15,6.00,9.00

అలంకార్ - లంగర్‌హౌజ్ 11.00,2.00,6.00,9.00

సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00

సెన్సేషన్ ఇస్మోమ్నియ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00

నర్తకి 70 ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30

ఆరాధన ఎ/సి - తార్నాక 11.00,2.00,6.00,9.00

BR హైటెక్ - మాదాపూర్ 11.00,2.00,6.00,9.00

విజేత 70 ఎ/సి - బోరబండ 11.00,2.00,6.00,9.00

సూపర్ ఎ/సి - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00

రుక్మిణి ఎ/సి - పటాన్‌చెరు 11.00,2.00,6.00,9.00

సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00

శ్రీప్రేమ ఎ/సి - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00

ఈ నెల 25న బ్రహ్మాండమైన విడుదల



PRASADS మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్	MIRAJ మీరజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR ఇన్ ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ASIAN సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్
PVR ఆర్.కె. కాంప్లెక్స్ - బంజారాహిల్స్	ASIAN CINEPRIDE లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
PVR సెంట్రల్ మాల్ - పంజాగుట్ట	ASIAN జిపిఆర్ ఎ/సి - కూకట్‌పల్లి
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ASIAN ఎంక్యూబ్ ఎ/సి - అత్తాపూర్
INOX జి.వి.కె. మాల్ - బంజారాహిల్స్	ASIAN RADHIKA రాధిక ఎ/సి - కాప్రా
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	ASIAN శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
BIG Cinemas AMEERPET బిగ్‌సినిమాస్ - అమీర్‌పేట్	Cinetown సినీటౌన్ ఎ/సి - మియాపూర్
BIG Cinemas SHAMEERPET లియోనియో - శామీర్‌పేట్	BVK MULTIPLEX విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
Cinépolis మంజీరా మాల్ - కూకట్‌పల్లి	ASIAN షా షహెన్‌షా ఎ/సి చింతల్
Cinépolis CCPL ఎ/సి - మల్కాజ్‌గిరి	ASIAN శ్రీదేవిమాల్ - హన్మకొండ
Cinépolis మంత్రామాల్ - అత్తాపూర్	GEETHA ASIAN ఉషాప్రసాద్ - నిజామాబాద్
TIVOLI కాంప్లెక్స్ ఎ/సి - సికింద్రాబాద్	INIARA CINEMAS స్వప్నమాల్ ఎ/సి - బీదర్
Cine Planet మల్టీప్లెక్స్ ఎ/సి - కొంపల్లి	మరియు మీ అభిమాన థియేటర్లలో

నేడే చూడండి



తెలుగు వెర్షన్

సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00

శ్రీక్రిష్ణ - మహబూబ్‌నగర్ | తిరుమల - కరీంనగర్ | ఆదిత్య 70 ఎంఎం - ఖమ్మం

ఇంగ్లీష్ వెర్షన్

తారకరామ 70 ఎంఎం ఎ/సి - కాచిగూడ 11.00,2.00,6.00,9.00

ప్రసాద్ మల్టీప్లెక్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్ 10.45,1.00,3.15,5.30,11.00	సినీపోలీస్ మంజీరామాల్ - కూకట్‌పల్లి 11.30,2.10,4.55,7.40,10.20	సినీటౌన్ ఎ/సి - మియాపూర్ 11.30AM & 6.30PM
పివిఆర్ ఫోరంమాల్ - కూకట్‌పల్లి 11.00,1.35,2.55,4.50,7.45,10.40	సినీపోలీస్ మంత్రమాల్ - అంత్తాపూర్ 11.40,2.00,4.55,7.25,9.45	టివోలీ సినిమాస్ - సికింద్రాబాద్ 11.00AM & 4.30PM
పివిఆర్ సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 11.10,1.40,5.00,10.20	సినీపోలీస్ సిసిపిఎల్ - మల్కాజ్‌గిరి 12.00,2.20,4.55,7.50,9.50	ఏషియన్ ఎంక్యూబ్ - అత్తాపూర్ 11.00AM & 7.45PM
పివిఆర్ ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 10.30,2.25,7.40,10.30	బిగ్‌సినిమాస్ - అమీర్‌పేట 11.30,5.00,10.50PM	ఏషియన్ సినీస్క్వేర్ ఎ/సి - ఉప్పల్ 1.50 & 10.40PM
పివిఆర్ ఆర్.కె కాంప్లెక్స్ - బంజారాహిల్స్ 1.35 & 8.00PM	బిగ్‌సినిమాస్ లియోనియో - శామీర్‌పేట్ 12.00,5.20,10.40PM	ఏషియన్ లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట 2.30 & 9.20PM
ఐనాక్స్ జివికె మాల్ - బంజారాహిల్స్ 10.35,2.10,5.30,7.45,11.00	మీరజ్ శాలినీశివాని - దిల్‌సుఖ్‌నగర్ 5.10,7.50,10.30PM	ఏషియన్ శ్రీదేవి మాల్ - హన్మకొండ
ఐనాక్స్ ఎంపి మాల్ - కాచిగూడ 10.20,3.05,8.00,10.20	సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి 11.00AM & 10.25PM	ఏషియన్ గీతా ఉషాప్రసాద్ - నిజామాబాద్
		ఎస్2 సినిమాస్ మల్టీప్లెక్స్ - వరంగల్

హిందీ వెర్షన్:

సంతోష్ 70 ఎంఎం - అబిడ్స్ 11.30,2.30,6.15,9.15 | **శ్రీరామా** ఎ/సి - బహదూర్‌పుర 11.30,2.30,6.00,9.00

ఇంద్ర స్వప్న మాల్ - బీదర్ | ముక్తా ఎ2 సినిమాస్ - గుల్బర్గా | శెట్టి మల్టీప్లెక్స్ - గుల్బర్గా | మీరా సినిమా - గుల్బర్గా

A WARNER BROS. PICTURES RELEASE

విజయవంతమైన 2వ వారం



సంధ్య 70 ఎంఎం ఏ/సి- ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 11.00,2.00,6.00,9.00

భ్రమరాంబ - కూకట్‌పల్లి 11.15,2.30,6.15,9.30

రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15

PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్స్ - 1.45,8.15
PVR INORBIT MALL మాదాపూర్ - 11.05,2.10,7.45
PVR RK COMPLEX బంజారాహిల్స్ - 10.25,4.25
PVR CENTRAL MALL పంజాగుట్ట - 12.00,4.10
PVR FROUM MALL 10.35,1.15,7.25,10.15
INOX GVK బంజారాహిల్స్ - 4.25,10.25
INOX కాచిగూడ - 4.30,10.30
BIG Cinemas AMEERPET అమీర్‌పేట్ - 10.20,5.00
BIG Cinemas SHAMEERPET శామీర్‌పేట్ - 2.20,7.50
Cinépolis KUKATPALLY కూకట్‌పల్లి ఏ/సి - 1.55,7.30
Cinépolis CCPL - MALKAJGIRI మల్కాజ్‌గిరి - 11.10,5.00,10.55
Cinépolis ATTAPUR అత్తాపూర్ ఏ/సి - 1.55,7.30
ASIAN MULTIPLEX KUKATPALLY కూకట్‌పల్లి - 1.40,7.40
ASIAN CINEMAS ATTAPUR అత్తాపూర్ ఏ/సి - 1.40,7.20
ASIAN RADHIKA MOVIEPLEX కాప్రా ఏ/సి - 4.40,10.40
ASIAN CINE SQUARE UPPAL ఉప్పల్ - 10.50,4.30,10.30
Cine Planet కోంపల్లి - 1.25,4.15,10.15
MIRAJ - దిల్‌సుఖ్‌నగర్ 10.45,5.15
T ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్ 11.15,6.15
MULTIPLEX BVK L.B.NAGAR ఏ/సి - 2.00,4.40,7.30
ASIAN CINEMAS హన్మకొండ - 1.40,7.40
GEETHA ASIAN నిజామాబాద్ - 1.30,10.20
SVC కరీంనగర్ - 6.15,9.15
S2 CINEMAS వరంగల్ - 12.40,3.45,9.20

లక్ష్మీకళ ఏ/సి - మూసాపేట 11.15,2.45,6.15,9.45
టివోలి ఎక్స్‌ట్రీమ్ - సికింద్రాబాద్ 2.00,4.50,7.40
సినీటౌన్ మల్టీప్లెక్స్ ఏ/సి - మియాపూర్ 2.15,9.45
గంగ మల్టీప్లెక్స్ ఏ/సి - దిల్‌సుఖ్‌నగర్ 2.15PM
షెహన్ షా 70 ఏ/సి - హెచ్ఎంటి చింతల్ 2.30,9.30
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 11.152.15,6.15,9.15
శ్రీలత - రామచంద్రాపురం 11.15,2.15,6.15,9.15
శ్రీనివాస 70 ఏ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
స్వప్న 35 ఎంఎం ఏ/సి - కాటేదాన్ 11.15,2.15,6.00
జగదాంబ ఏ/సి - ఘట్‌కేసర్ 11.00,2.00,6.00,9.00
కృష్ణ సినిమా - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
సెలక్ట్ ఏ/సి - మచ్చబొల్లారం 12.00,3.00,7.00,10.00
జ్యోతి ఏ/సి - ఐడిఏ బొల్లారం 11.00,2.00,6.00,9.00
శ్రీరమణ కాంప్లెక్స్ - అంబర్‌పేట్ 11.00,2.00,6.00,9.00
విమల్ ఏ/సి - బాలానగర్ 11.00,2.00,6.00,9.00
శ్రీదేవి ఏ/సి - చిలకలగూడ 11.15,2.15,6.15,9.15
లక్ష్మీ కళామందిర్ ఏ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
కృష్ణ సినిమా - నాగారం 11.00,2.00,6.00,9.00
ముకుంద్ ఏ/సి - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00

తెలుగు ప్రేక్షకుల్ని ఫిదా చేస్తున్న BLOCKBUSTER



సుదర్శన్ 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.15,2.15,6.15,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

PRASADS 11.30,5.00,8.15
PVR - మాదాపూర్ 1.00,7.25
PVR - బంజారాహిల్స్ 4.00PM
PVR - పంజాగుట్ట 11.00AM, 7.15PM
PVR - కూకట్‌పల్లి 11.00,7.45,10.30
BIG Cinemas AMEERPET ఏ/సి - అమీర్‌పేట్ 7.30PM
Cinépolis ఏ/సి - కూకట్‌పల్లి 4.50PM
Cinépolis - మల్కాజ్‌గిరి 4.40PM
Cinépolis ATTAPUR - అత్తాపూర్ 7.35PM
TIVOLI 11.00,10.00PM
Cine Planet - కొంపల్లి 1.50,7.40PM
మీరజ్ - దిల్‌సుఖ్‌నగర్ 4.40PM
ASIAN CINE SQUARE - ఉప్పల్ 1.45,7.45
T ఇసిఐఎల్ - 2.15,9.15
INOX GVK - బంజారాహిల్స్ 2.25,7.25
INOX ఎంపి - కాచిగూడ 4.20PM
ASIAN MULTIPLEX - కూకట్‌పల్లి 7.30PM
ASIAN - అత్తాపూర్ 1.30PM
ASIAN RADHIKA - కాప్రా 1.40,7.30
ASIAN SHIVA GANGA - దిల్‌సుఖ్‌నగర్ 2.00,6.00
MULTIPLEX BVK - ఎల్‌బినగర్ 2.00,7.30
Cinetown - మియాపూర్ 2.30PM
ASIAN CINEMAS - హన్మకొండ - 4.50PM
GEETHA ASIAN నిజామాబాద్ - 4.40PM
ఎస్2 సినిమాస్ - 2.05,7.35

లక్ష్మీకళా సినీప్రైడ్ - మూసాపేట్ 11.30,2.30,6.15
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.15,2.15,6.15,9.15
శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
జ్యోతి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15
శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి 11.00,2.00,6.00,9.00
సుష్మ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
మహేశ్వరి- మహేశ్వరం 11.00,2.00,6.00,9.00

SVC ప్రతిమ - కరీంనగర్ | SVC దేవి - జనగాం | SVC రామకృష్ణ - షాద్‌నగర్

వరంగల్
రామ్ ఏ/సి - వరంగల్
అమృత - హన్మకొండ
జయశ్రీ ఏ/సి - నర్సంపేట్

ఖమ్మం
వినోద ఏ/సి - ఖమ్మం
దుర్గా ఏ/సి - కొత్తగూడెం
ఉదయ్‌భాస్కర్ - భద్రాచలం
బాలాజీ ఏ/సి - సత్తుపల్లి
సీతారామా - మణుగూరు

కరీంనగర్
తిరందాజ్ - కరీంనగర్
న్యూఅశోక - గోదావరిఖని
బాలాజీ ఏ/సి - జగిత్యాల

నిజామాబాద్
విజయ ఏ/సి - నిజామాబాద్
ప్రియా ఏ/సి - కామారెడ్డి
మహేశ్వరి - బాన్సువాడ
వెంకటేశ్వర - ఆర్మూర్
వెంకటేశ్వర - బోధన్

మహబూబ్‌నగర్
తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్
శ్రీనివాస ఏ/సి - వనపర్తి
వెంకటేశ్వర - గద్వాల్
బాబా - నారాయణ్‌పేట్
శ్రీనివాస ఏ/సి - జడ్చర్ల
పరమేశ్వరి - కొత్తకోట

నల్గొండ
తిరుమల ఏ/సి- నల్గొండ
శ్రీనివాస - మిర్యాలగూడ
తిరుమల - సూర్యాపేట్
వసుంధర - భువనగిరి
రంగ ఏ/సి - కోదాడ

ఆదిలాబాద్
మహేశ్వరి - ఆదిలాబాద్
శ్రీనివాస - మంచిర్యాల
నారాయణ ఏ/సి - నిర్మల్

మెదక్
సీతారామ ఏ/సి- సిద్దిపేట
రుక్మిణి ఏ/సి - సంగారెడ్డి
మోహన్ -జహీరాబాద్

రంగారెడ్డి
లక్ష్మీ ఏ/సి - తాండూర్
భవాని ఏ/సి - పరిగి

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మంత్రి లక్ష్మారెడ్డి



మంత్రిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి అన్నారు. పండుగలను ప్రజలు శాంతి యుతంగా, సోదరభావంతో జరుపుకోవాలని ఆయన సూచించారు. తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ రామాసిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకలో మంత్రి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌తో కలిసి మైసమ్మ దేవాలయంలో మంత్రి పూజలు నిర్వహించారు. గ్రామస్థులకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. తలకొండపల్లి మాజీ ఎంపిపి సి.ఎల్.శ్రీనివాస్ యాదవ్, వెల్జాల్ సర్పంచ్ సి.ఎల్.సంగీత మంత్రి లక్ష్మారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. నాయకులు పాండు, సుదాబాల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, గిరినాయక్, శంకర్‌నాయక్, భాస్కర్, దస్తగిరి, రాజు, యాదయ్య, శ్రీరామ్, పరందాములు, బుచ్చమ్మ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామాసిపల్లిలో మైసమ్మ బోనాలు అంబరాన్నంటాయి. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు.

మల్కాజ్‌గిరి, అల్వాల్ జోనల్‌స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

● క్రీడలు నిర్వహించు స్థలం : సెయింట్ అల్‌ఫోన్సెస్ హైస్కూల్
● సమయం : ఉ.9 గంటలకు ● 23న వాలీబాల్, ఖోఖో, 24న కబడ్డీ పోటీలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : మేడ్చల్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి, అల్వాల్ జోనల్ స్థాయి పాఠశాలల టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. ఈనెల 23న అల్వాల్, సూర్యనగర్ కాలనీలోని సెయింట్ అల్‌ఫోన్సెస్ హైస్కూల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నట్లు జోనల్ స్థాయి పాఠశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు. ఈ పోటీల్లో మల్కాజ్‌గిరి, అల్వాల్‌కు చెందిన ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలకు చెందిన (అండర్ 14) 6, 7, 8 తరగతులు, (అండర్ 17) 9,10 వ తరగతి చదువుతున్న బాలబాలికలను పాల్గొనాల్సి ఉంటుందన్నారు. 23వ తేదీనా వాలీబాల్, ఖోఖో పోటీలు, 24న కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు, ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా తమ పాఠశాలలో చదువుతున్నట్లు బోనఫైడ్‌పై ఫోటో అతికించి ఆ పాఠశాల హెచ్ఎం సంతకం, పాఠశాల ముద్ర ఉండాలని తెలిపారు. క్రీడలకు వచ్చే విద్యార్థులు ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తీసుకొని రావాలని సూచించారు. వివరాలకోసం 9948263609 సంప్రదించాలని కోరారు.





లగోరి చాంపియన్ తెలంగాణ

● క్రీడల ద్వారా దేశ ప్రతిష్టను పెంపొందించేందుకు ప్రధాని మోదీ కృషి
● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావు

అనంతగిరి : లగోరి క్రీడను గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకువెళ్లి విస్తృతంగా అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కరణం ప్రహ్లాదరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శేరి నర్సింగ్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న లగోరి జాతీయ జూనియర్ క్రీడలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా ముగింపు సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు చాంపియన్ ట్రోఫీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, వేల సంవత్సరాల కిందటనే లగోరి ఆట ఉన్నట్లు చరిత్ర చెపుతుందని, శ్రీ కృష్ణుడు లగోరి ఆటను ఆడినట్లు మహాభారతంలో ఉందన్నారు. దేశంలో క్రీడలను ప్రోత్సహిస్తూ అంతర్జాతీయంగా ఈ దేశ ప్రతిష్టను పెంచేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమిలో సైతం ఆనందం ఉంటుందని చెప్పారు. ప్రతి క్రీడాకారుడు ఆటను ఆస్వాదించాలన్నారు. ఓటమి అనేది గెలుపునకు తొలిమెట్టు అని, ఆడుకుంటూ పోతే గెలుపు అదే వరిస్తుందని చెప్పారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం లభించకపోవడం శోచనీయమని అన్నారు. క్రీడలను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని వారు గుర్తుచేశారు. రెండు రోజుల పాటు వర్షంలో క్రీడలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. జిల్లా కేంద్రలో ఒక మినీ స్టేడియం ఉండక పోవడం పాలకుల చేతగానితనానికి నిదర్శనమని వారు విమర్శించారు. మరుగున పడ్డ భారతీయ సంప్రదాయ క్రీడ అయిన లగోరిని వెలుగులోకి తీసుకు వచ్చి ఈ ఆటను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లినందుకు జాతీయ లగోరి ఫెడరేషన్‌ను వారు అభినందించారు. అంతకు ముందు లగోరి ఫెడరేషన్ తెలంగాణ కార్యదర్శి నవీన్ మాట్లాడారు.



తమిళనాడు బాలిక జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ మంత్రి


ఫైనల్‌లో తలపడుతున్న తెలంగాణ, మహారాష్ట్ర జట్లు


చాంపియన్ షిప్ సాధించిన తెలంగాణ, తమిళనాడు జట్లు

ఆదివారం జరిగిన లగోరి ఫైనల్స్‌లో బాలుర విభాగంలో మహారాష్ట్ర, తెలంగాణ జట్లు తలపడగా, మహారాష్ట్ర జట్టుపైన తెలంగాణ జట్టు విజయం సాధించింది. అదే బాలికల విభాగంలో తమిళనాడు, హర్యాన జట్లు తలపడగా, తమిళనాడు జట్టు హర్యాన జట్టుపై గెలుపొందింది. బాలుర విభాగంలో తెలంగాణ జట్టు, బాలికల విభాగంలో తమిళనాడు జట్లు చాంపియన్‌షిప్ సాధించాయి. బాలుర విభాగంలో మూడవ స్థానంలో తమిళనాడు, బాలికల విభాగంలో మూడవ స్థానంలో పాండిచ్చేరి జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, టీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, కేపీ రాజు, వివేకానందరెడ్డి, ఎంపీ డీవో సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వంటింట.. ఉల్లిమంట

● కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి ● ఆకాశాన్నంటిన ధర ● గరిష్ఠంగా కిలో రూ. 40

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : వంటింట్లో ఉల్లి మంట భగ్గుమంటుంది. కోయక ముందే కన్నీళ్లను తెప్పిస్తోంది. ఉల్లి ధర మండుతుండటంతో కొనాలంటే సామన్యులకు జంకుతున్నారు. మార్కెట్‌కు వెళ్లిన మహిళలు కిలో ఉల్లి కొనాలంటే ఆలో చిస్తున్నారు. కిలో కొనే వారు నేడు అరకిలోతో సరి పెడుతున్నారు. పెరిగిన ఉల్లిధరతో సామాన్యుల జేబులు ఖాళీ అవుతున్నాయి. గత నెల క్రితం 15 రూపాయలున్న ఉల్లి ధర నేడు రూ. 35కు చేరింది. క్వాలిటీ రంకం 40 రూపాయల వరకు అమ్ముతున్నారు. ప్రతి ఇంట్లో ఉల్లి లేకుండా ఏ వంటా కుదరదు. కూరల్లో ఉల్లికి అత్యంత ప్రాధాన్యం. అటువంటి ఉల్లి ధర వింటుంటే సామాన్యుడు ఉల్కి పడుతున్నాడు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో నిరుపేదలు ఏం కొనాలో.. ఏం తినాల్లో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పెరుగుతున్న ధరలను నియంత్రించలేక పోతుందని సామాన్యులు పేర్కొంటున్నారు. ఆకాశానికి నిచ్చన వేసిన ఉల్లి ధరతో నేడు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత వారం రోజుల క్రితం కిలో రూ. 15 ఉన్న ఉల్లి నేడు రూ. 35 నుంచి 40 కు చేరుకుంది. నాసిరకం ఉల్లిగడ్డ కూడా రిటైల్‌గా రూ. 20 నుంచి 25 పలుకుతోంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ ఉల్లికి ప్రసిద్ది. ఈ మార్కెట్‌కు వికారాబాద్ జిల్లా పరిధిలోని ఎన్కతల, సంగారెడ్డి జిల్లా గొల్లపల్లి, జూలకంటి నుంచి ఇక్కడికి ఉల్లిని తరలిస్తున్నారు. నెల రోజుల క్రితం హోల్‌సేల్‌గా క్వింటాల్‌కు రూ. 600 నుంచి గరిష్ఠంగా 900 పలికిన ఉల్లి జూలై 20 తర్వాత అమాంతం పెరిగింది. ప్రస్తుతం శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లిగడ్డ రూ. 2,300 నుంచి 2,500 (హోల్‌సెల్) పలుకుతోంది. ఇక్కడ నుంచి వ్యాపారస్తులు తీసుకెళ్లి రిటైల్‌గా కిలో 35నుంచి 40 వరకు అమ్ముతున్నారు. ప్రస్తుతం ఉల్లి నిల్వలు లేక పోవటంతో ధర పెరిగిపోయినట్లు తెలుస్తోంది. అలాగే హైదరాబాద్‌లోని మలక్‌పేట మార్కెట్ నుంచి జిల్లాకు ఉల్లి సరఫరా అవుతుంది. ప్రస్తుతం నగరానికి మహారాష్ట్ర, కర్నూల్ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ ఉల్లి పంటలు దెబ్బతినటంతో.. దిగుబడి తగ్గిందని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ఉల్లి ధరను నియంత్రించాలని, ఉల్లి ధర మరింతగా పెరిగితే.. ఆహార భద్రత కార్డుపై సబ్సిడీపై ఉల్లిని పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

● టీసీపీఎస్ఈఏ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ

శంషాబాద్ : నూతన పింఛన్ విధానం రద్దుకోసం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ కంట్రీబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయ్ అసోసియేషన్(టీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో ఆదివారం శంషాబాద్ ర్యాలీ నిర్వహించి సమరశంఖారావం మహసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసిషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. కృష్ణకుమార్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1వ తేదీ తరువాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సర్వీసుల్లో చేరిన ఉద్యోగులందరిని నూతన పింఛన్ పథకం(ఎన్‌పీఎస్) కంట్రీబ్యూషన్ పెన్షన్ పథకం (సీపీఎస్) పరిధిలోకి తీసుకు వచ్చింది. సెప్టెంబర్ 1 సర్వీసులో చేరిన ఉద్యోగ ఉపాద్యాయులకు ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ పెన్షన్ రూల్స్ 1980 మరియు జీఫీఎఫ్ రూల్స్ 1935 వర్తించవన్నారు. ఈ పన్షన్ రూల్స్‌ను పూర్తిగా రద్దుచేసి సీపీఎస్ కోసం జీవో 653, 54, 55లను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోలను రద్దు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లక్ష ఇరవై వేలమంది ఉద్యోగులు సీపీఎస్ విధానం వల్ల ఎలాంటి ఆర్థిక భద్రత సంక్షేమం లేక భరోసాలేని బతుకులయ్యాయన్నారు. మన రాజ్యాంగంలో 1931 ఆర్థికల్ ప్రకారం ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తరువాత ఇవ్వాల్సిందేనని పింఛన్‌ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదు అది ఉద్యోగుల హక్కు అని గుర్తు చేశారు. ఉద్యోగుల ప్రాథమిక హక్కుతో ప్రభుత్వం ఆటలు ఆడుకోద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమూర్తి, బుచ్చన్న, రంగారడ్డి అలి, ప్రధాన కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల ఆందోళనకు యువజన కాంగ్రెస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి సంఘీభావం తెలిపారు.



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాలు

కంట్రీబ్యూటరీ పింఛన్ పథకం రద్దు చేయాలి

● టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్‌రెడ్డి


వాల్‌ఫోస్టర్ విడుదల చేస్తున్న టీఎస్‌యుటీఎఫ్ నాయకులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : కంట్రీబ్యూటరీ పింఛన్ పథకాన్ని రద్దు చేయాలని టీఎస్‌యుటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం టీఎస్‌యుటీఎఫ్ భవన్‌లో రంగారెడ్డి జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీపీఎస్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1న ప్రకటిస్తూ వాల్‌ఫోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎం. ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల విద్రోహకారి సీపీఎస్ మహమ్మారిని పారద్రోలినప్పుడే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రశాంతత జీవన భద్రత లభిస్తుందని అందుకోసం సెప్టెంబర్ 1న రాష్ట్రంలోని జిల్లా కలెక్టరేట్ల ముందు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో లక్ష ఇరవై వేల మంది ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాల భద్రతను ఆగమ్యగోచరం చేస్తూ ఆందోళనకు గురి చేస్తున్న 'కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకాన్ని' రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో చనిపోయిన, రిటైర్ అయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలు గ్రాట్యూటీ లేక పీఎఫ్ లేక కుటుంబ పింఛన్ అందక ఆర్థిక ఇబ్బందులతో గౌరవప్రదమైన జీవితాన్ని కోల్పోతున్నారని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటప్ప, జిల్లా కార్యదర్శులు యం. విజయలక్ష్మీ, రాములయ్య, కల్పన, అర్జున్‌రెడ్డి, నాగేంద్రం, అనిల్ కుమార్, శివారెడ్డి, గోపాల్, నిరంజన్, దామోదర్ పాల్గొన్నారు.

రేపు బుద్వేల్‌కు సీఎం రాక


మాట్లాడుతున్న మంత్రి నాయిని నర్సింహారెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్ : ఈనెల 22న రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్ గ్రామానికి సీఎం కేసీఆర్ రానున్నారు. అక్కడ రెడ్డిహాస్టల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నారు. దీని కోసం పకడ్బందీ ఏర్పాటు చేయాలని హోంమంత్రి నాయిని నర్సింహరెడ్డితో పాటు రాష్ట్ర రవాణశాఖ మంత్రి డాక్టర్ మహేందర్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. సీఎం శంకుస్థాపన చేయనున్న రెడ్డి హాస్టల్‌కు సంబంధించిన స్థలాన్ని వారితో పాటు ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. రఘునందన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. ఈనెల 22న రెడ్డి హాస్టల్ నిర్మాణానికి సీఎం కేసీ ఆర్ శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. హాస్టల్ నిర్మాణం కోసం రూ. 10 కోట్లు, పదెకరాల భూమిని సీఎం కేటాయించినట్లు తెలిపారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి హాస్టల్ నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లాలో స్థలం కేటాయించడం సంతోషకరమని పేర్కొన్నారు. రెడ్డిలతో పాటు ఇతర కులాల అభ్యున్నతికి రెడ్డి హాస్టల్ ఉపయోగపడుతుందన్నారు.